

# హైదరాబాద్ వార్త

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు

# పగటి కలేనా?

-రెండు దశాబ్ధాలుగా రాజకీయ, ప్రజాసంఘాలు పోరాటం -ప్రతి మండల కేంద్రంలో కార్యాలయం అల్వాల్‌కు మొండి చేయి



పాటిగడ్డలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

**అల్వాల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భాం తరువాత పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న జిల్లాలు అపై మండల కేంద్రాలు సంఖ్య గణనీయంగా పెరిగిన విషయం తెలిసిందే. ప్రతి మండల కేంద్రం పరిధిలో అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యాలయాలు వెలిసాయి. అల్వాల్‌కు వరకు వచ్చే సరికి ప్రధానంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు సుదూర స్వప్నంగా మారింది. మెడ్చెల్ జిల్లా పరిధిలోని అల్వాల్‌కు సంబంధించిన సబ్ రిజిస్టార్ కార్యాలయం హైదరాబాద్ జిల్లా పరిధిలో నేటికి కొనసాగుతుండడం విశేషం. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న నాటి నుంచే ఈ పరిస్థితి ఉంది. సికింద్రాబాద్‌లోని వల్లబ్‌నగర్ అక్కడి నుంచి పాటిగడ్డకు మారింది. నేడు పాటిగడ్డలో ఒకప్పటి హుడా నేటి హెచ్‌ఎండిఎకు చెందిన భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతోంది. హెచ్‌ఎండిఎకు అద్దె కడుతున్న వైనం. రవాణా సౌఖర్యం కూడా సక్రమంగా లేని ప్రాంతంలో కీలకమైన శాఖకు చెందిన కార్యాలయం ఉండడం విమర్శలకు తావు ఇస్తోంది. జిల్లాలోని 13 మండల కేంద్రాలు ఉండగా ప్రతి మండలం కేంద్రం మెడ్చెల్, శామీర్‌పేట్, కుద్బుల్లాపూర్, వల్లభ్‌నగర్, కీసర, కూకట్‌పల్లి, బాలానగర్, మల్కాజిగిరి, కాప్రా, నారాపల్లి, ఘట్‌కేసర్, ఉప్పల్ ప్రాంతాలులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా కేవలం అల్వాల్ మండం కేంద్రంలో మాత్రమే కార్యాలయం ఇప్పటికీ లేదు. ప్రభుత్వాలు ఎన్ని మారినా అల్వాల్ ప్రాంతంపై రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగం శీతకన్ను కొనసాగుతోందనే చెప్పాలి. దశాబ్ధాలు కాలంగా రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు స్థానికంగా కార్యాలయం ఏర్పాటుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా ఉంది. ఇటీవల భారతీయ జనతాపార్టీ ఒక అడుగు ముందుకు వేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అల్వాల్‌లో ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను బలంగా తెరపైకి తీసుకుని రావడం జరిగింది. జిల్లా బిసి మోర్చా మాజీ అధ్యక్షుడు దండుగల వెంకటేష్ నేతృత్వంలోని నేతలు కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉన్నత స్థాయిలోని మంత్రులు, అధికార యంత్రాంగానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావులు వరకు వినత్రి పత్రాలు అందించారు. అల్వాల్ పరిధిలో ఉండాల్సిన కార్యాలయం 13 కిలోమీటర్లు దూరంలో సంవత్సరాలు కాలంగా ఉండడం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. సొంత వాహనాలు లేని వారికి పాటిగట్ట వరకు వెళ్ళాలంటే నరకప్రాయమనే చెప్పాలి. అల్వాల్‌లో బస్సు ఎక్కి మరలా సికింద్రాబాద్‌లో మరో బస్సు పట్టుకుని అక్కడి నుంచి బేగంపేట్ ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి లోపలికి కిలోమీటరున్నర దూరం నడక ద్వారా వెళ్ళాల్సిన పరిస్థితి. రిజిస్ట్రేషన్ చార్జీలు కోసం లక్షలులో నగదును తీసుకుని వెళ్ళి బ్యాంకులులో చలాన్లు చెల్లించాలి. పెద్ద మొత్తంలో నగదు తీసుకుని వెళ్ళాలంటే భారంగా పరిణమిస్తోంది.

### 99శాతం రిజిస్ట్రేషన్‌లు అల్వాల్ మండలానికి చెందినవే

పాటిగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అల్వాల్ మండలంతో పాటుగా బేగంపేట్ విలేజ్ వార్డు నెం1 ప్రాంతానికి చెందిన ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. 99 శాతం అల్వాల్ మండలానికి సంబంధించిన దస్తావేజులు కాగా 1శాతం మాత్రమే బేగంపేట్‌కు చెందినవి ఉంటాయి. అల్వాల్ ప్రాంతానికి చెందిన రిజిస్ట్రేషన్ల ద్వారా నెలకు సుమారు 250 కోట్లుకు పైగా ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. 2020 నుంచి 2024 ఆగస్టు 31 వరకు అల్వాల్ ప్రాంతానికి చెందిన దస్తావేజులు 28,480 వేలు రిజిస్ట్రేషన్ కాగా బేగంపేట్ ప్రాంతానికి సంబంధించి కేవలం 2,412 మాత్రమే జరిగాయి. అల్వాల్ నుంచి ఆదాయం పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖజానాకు జమా అవుతున్న తరుణంలో సబ్ రిజాస్ట్రార్ కార్యాలయం దూరంగా ఉండడం ఎంత వరకు సమంజసమని ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు పౌరులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో కార్యాలయం ఉండగా అల్వాల్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదనేది పెద్ద ప్రశ్నగా మారింది. జిహెచ్ఎంసి, తహసీల్దార్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రి, గ్రంధాలయం, జలమండలి కార్యాలయాలు స్థానికంగా ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌లో ఏర్పాటు చేయక పోవడంపై ఉన్న మతలబు ఎవరికి అర్థం కాని విషయం. ఇదిలా ఉండగా స్థానికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సీఎంతో పాటుగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వినతులు అందించారు. గత సంవత్సరం కాలంగా జిల్లా బిసి మోర్చా మాజీ అధ్యక్షుడు దండుగల వెంకటేష్ ఇతర నేతలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి కదలికను తీసుకువచ్చారనే చెప్పాలి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపి ఈటెల రాజేందర్, రాష్ట్రమంత్రి పొంగులేటి, స్టాంప్స్ అండ్ రెవెన్యూ కార్యదర్శి, మున్సిపల్ కార్యాదర్శి, జిల్లా కలెక్టర్, డిఆర్ఓ, ఎస్ఆర్ఓ ఇతర ఉన్నతాది కారులను కలిసి అల్వాల్‌కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవసరనాన్ని వీరు బలంగానే తీసుకుని వెళ్ళారు.

### ఫుట్‌పాత్‌లను అక్రమిస్తే సహించేది లేదు : సిఈఓ మధుకర్ నాయక్



ఫుట్‌పాత్‌లను తొలగిస్తున్న కంటోన్మెంట్ బోర్డు ట్రాఫిక్ పోలీసులు

**కంటోన్మెంట్, డిసెంబరు 24ప్రభాతవార్త:** ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపార కార్యకలాపాలు సాగిస్తే ఎంతటి వారినైనా సహించే లేదని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, ట్రాఫిక్ అడిషనల్ కమీషనర్ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డిసిపి రాహుల్ ఎగ్డేలు హెచ్చరించారు. మంగళవారం బోయిన్‌పల్లి డైమాండ్ పాయింట్, ఢిల్లీపబ్లిక్ స్కూల్ ఇంపిరియల్ గార్డెన్, బోయిన్‌పల్లి మార్కెట్ ప్రధాన రహదారులోని రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌లపై నిబంధనలకు విరుద్ధంగా కొనసాగు తున్న దుకాణాలు, షాప్‌లు, టీ స్టాల్స్, పాన్ డబ్బాలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు శానిటరీ సూపరిండెండ్ ఎం.దేవేందర్, పోలీస్ అధికారులు నరేశ్, శ్రీధర్, మధు బాబు, పాల్గొన్నారు.

## అమెరికా అల్లుడి వేదింపులు

-కూతురితో కలిసి తండ్రి ఆత్మహత్యాయత్నం

-ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తండ్రి మృతి

**అల్వాల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** అమెరికా అల్లుడిని చూసుకుని కూతురి జీవితం సుఖ సంతోషాలుతో గడిచి పోతుందనుకున్నాడా తండ్రి. వివాహం అంగరంగ వైభవంగా జరిపి కూతురిని అమెరికాకు పంపించాడు. పాశ్చాత్య దేశంలో కూతురు పండంటి మనువరాలికి జన్మనిచ్చింది. ఆ తండ్రికి ఆనందానికి అవదులు లేవు. ఇదిలా ఉండగా ఇటీవల ఆమెరికాలో కూతురు అనారోగ్యానికి గురవడంతో అల్లుడు బిడ్డతో సహా భార్యను ఇండియాలోని పుట్టింటికి పంపించాడు. అక్కడి నుంచే అల్లుడి వేదింపులు మొలయ్యాయి. తొమ్మిది నెలలు చిన్నారిని తల్లికి తాతకి దూరం చేసి తనతో తీసుకుని నగరంలోని తల్లిదండ్రులు ఇంటికి వెళ్ళి పోయాడా అల్లుడు. జీవితంపై విరక్తి చెందిన తండ్రీ కూతులు ఆహారంలో విషం కలుపుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. తండ్రి మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది కూతురు. అల్వాల్‌లో చోటు చేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ రిట్రీట్ కాలనీకి చెందిన జగన్మోహన్ రెడ్డి తన కూతురు స్నేహారెడ్డి వివాహం సురారంకు చెందిన నవీన్ రెడ్డితో 2021లో జరిపించాడు. అనంతరం కొన్ని రోజులుకే దంపతులు అమెరికాకి వెళ్ళి పోయారు. 2024 మార్చి నెలలో దంపతులకు బిడ్డ జన్మించింది. పురుడు తరువాత స్నేహారెడ్డి అనారోగ్యానికి గురైంది. మే నెలలో భార్య, బిడ్డను ఇండియాలోని ఆమె పుట్టింటికి పంపించాడు. ఇటీవల నగరానికి వచ్చిన నవీన్ రెడ్డి అత్తింటి వారితో గొడవ పడి బిడ్డను తనతో పాటుగా సురారంలోని తన ఇంటికి తీసుకుని వెళ్ళి పోయాడు. చిన్నారిని తల్లి వద్దకు పంపించమని జగన్మోహన్ రెడ్డి ప్రాదేయ పడినా వారు కనుకరించ పోగా అవమానకరమైన రీతిలో ప్రవర్తించారు. అల్లుడు ఆయన కుటుంబ సభ్యుల వేదింపులు భరించలేని తండ్రీ, కూతురు జగన్మోహన్ రెడ్డి, స్నేహారెడ్డిలు ఈ నెల 12వ తేదీన ఆహారంలో విషయం కలిపి తిన్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన ఇరువురిని వైద్యం నిమిత్తం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జగన్మోహన్ రెడ్డి మంగళవారం చనిపోగా స్నేహారెడ్డి చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టర్ ఇంట్లో బీహారీ దొంగల హల్‌చల్

-దోచుకున్న బంగారు నగలు,నగదుతో దంపతుల ఉడాయింపు



దొంగతనానికి పాల్పడిన బిహార్ దంపతులు వీరే..

**అత్తాపూర్ డిసెంబరు24,ప్రభాతవార్త :** ఇంట్లో పనిలో చేరిన బిహారీ దంపతులు చోరికి పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు వివరాల ప్రకారం....బండ్లగూడ మ్యాపిల్ టౌన్ షిప్ విల్లాస్‌లో డాక్టర్ .కొండల్ రెడ్డి కుటుంబంతో నివాసం ఉంటున్నాడు.ఈ క్రమంలో గత నెలలో బీహార్‌కు చెందిన నమిన్ కుమార్ యాదవ్ దంపతులు వారి ఇంట్లో పనిమనిషులుగా చేరి నమ్మకంగా ఉన్నారు.అయితే ఎప్పటిమాదిరిగానే సోమవారం రాత్రి పని పూర్తయిన తర్వాత 10 గంటలకు సర్వెంట్ క్వాటర్స్‌కు వెళ్లారు.మంగళవారం ఉదయం కొండల్ రెడ్డి లేచి చూడగా పనిమనుషులు కనిపించలేదు.దీంతో పాటు చోరీ విషయం తెలిసింది.సోమవారం రాత్రి 16 తులాల బంగారు ఆభరణాలు ,అదేవిధంగా 35 వేల నగదును తీసుకొని పారిపోయినట్లు గుర్తించారు.వెంటనే కొండల్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి రాజేంద్ర నగర్ పోలీసులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి చేరుకున్న క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు.నమీన్ కుమార్ యాదవ్ దంపతులు సొత్తు చోరీ చేసుకొని వెళ్లే దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయి.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.








## అంతటా క్రిస్మస్ శోభ

- వేడుకలకు ముస్తాబైన చర్చిలు

**హైదరాబాద్, డిసెంబరు 24 ప్రభాతవార్త :** అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది.క్రిస్మస్ వేడుకలు జరుపుకునేందుకు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వివిధ చర్చిలు, క్రైస్తవ సంస్థలు ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. మంగళవారం అర్థరాత్రి నుంచి సామూహిక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. కొన్ని చర్చిల్లో జీసస్ జననం నుంచి శిలువ వరకు విశేషాలను ప్రదర్శించాయి. గన్‌ఫౌండ్రీలోని సెయింట్ జోసెఫ్ కేథడ్రిల్ ఆధ్వర్యంలో క్రిస్మస్, సండే స్కూల్, క్రిస్మస్ ఈవ్ మిడ్‌నైట్ మాస్‌తో సహా పలు ఈవెంట్‌లు నిర్వహించారు.చర్చి అలంకరణలో భాగంగా భారీ క్రిస్మస్ ట్రీ,జీవిత పరిణామ జనన దృశ్యాన్ని అక్కడ ఏర్పాటు చేశారు.

## సైబరాబాద్ కమిషనరేట్ వార్షిక సమావేశం

-సైబర్ క్రైం, ఆర్థిక నేరాలపై ప్రత్యేక దృష్టి

- సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

-సైబరాబాద్‌లో ఈ సంవత్సరం పెరిగిన సైబర్ క్రైమ్ కేసులు

**గచ్చిబౌలి, డిసెంబరు 24 ప్రభాతవార్త**

మారుతున్న కాలానికి అనుగుణంగా సైబరాబాద్ పోలీసులు సైబర్ క్రైం, ఆర్థిక నేరాల మీద ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు సైబరాబాద్ కమీషనర్ అవినాష్ మహంతి తెలిపారు. ఈ సంవత్సరం కమీషనరేట్ పరిధిలోని బాధితులు ఏదైనా సమస్యతో వస్తే ముందు కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా గతంకంటే కేసుల శాతం పెరిగిందని అన్నారు. కమీషనరేట్ పరిధిలో డ్రగ్స్ నిర్మూలను పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. సైబరాబాద్ వార్షిక సమావేశాన్ని మంగళవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమీషనరేట్‌లో నిర్వహించారు. కమీషనరేట్ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్న కమీషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ సైబర్ క్రైం కేసుల సంఖ్య గత సంవత్సరంతో పోల్చితే రెండింతలు పెరిగిందని, గత సంవత్సరం 5361 కేసులు నమోదు కాగా, ఈ సవత్సరం 11,914 కేసులు నమోదైనట్లు తెలిపారు. భూ, స్థల వివాదాల్లో సైతం గత సంవత్సరం కంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయని, గత సంవత్సరం 2904కేసులు ఉండగా, ఈ సంవత్సరం 4681 కేసులు రిజిస్టర్ అయ్యాయని తెలిపారు. ప్రాణనష్టం, ఎటువంటి గాయాలు లేని రహదారి ప్రమాదాల్లో సైతం పెరుగుదల ఉందని, ఈ సంవత్సరం ఈ తరహా కేసులు 3024 నమోదయ్యాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రమినల్ చట్టాలను జూలై 1వ తేదీ నుంచి కమీషనరేట్‌లో అమలు చేస్తున్నామని, ఈ కొత్త చట్టాల కింద ఇప్పటి వరకు 14,250 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ కింద నమోదైన కేసుల్లో ఎన్‌సిఆర్‌పి ద్వారా 7324, పిర్యాదుదారులు నేరుగా వచ్చి చేసినవి 5046 ఉన్నాయన్నారు. సైబర్ క్రైమ్ కేసుల్లో 25వేల రూపాయల కంటే తక్కువ మొత్తంలో ఉన్న పిర్యాదులు 17,916 వచ్చాయన్నారు. సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా 1.50 లక్షల ప్రాపర్టీ కేసులను సైబర్ క్రైమ్‌కు బదిలీ చేసేందుకు ఆలోచిస్తున్నామని అన్నారు. సైబర్ క్రైమ్ కింద నమోదైన కేసుల్లో అత్యధికంగా 3267 పార్ట్ టైం జాబ్ ప్రాడ్, 1686 ట్రేడింగ్ ప్రాడ్, 1276 స్మిషింగ్ ప్రాడ్, 1002 డిజిటల్ అరెస్టు ప్రాడ్ కేసులు ఉన్నాయన్నారు. డిజిటల్ అరెస్టు ప్రాడ్ కేసుల్లో 5.70కోట్లను బాధితులకు తిరిగి రిఫండ్ చేశామని, ఇది గత సంవత్సరంతో 72.71లక్షలుగా ఉందన్నారు. సైబర్ క్రైమ్ కేసుల్లో నమోదైన క్రైమ్ నెంబరు 5717లో బాధితులు ఇన్వెస్ట్‌మెంటు ప్రాడ్ కింద 1.33కోట్ల రూపాయలు పోగొట్టుకుంటే అందులో 96 లక్షలు జప్తు చేసి బాధితులకు అందజేశామని అన్నారు. క్రైమ్ నెంబరు 3012లో డిజిటల్ ప్రాడ్‌తో బాధితులు 60లక్షలు పోగొట్టుకుంటే మొత్తం డబ్బును తిరిగి బాదితులకు అందజేసినట్లు తెలిపారు. క్రిప్టో కరెన్సీ నేరాలను అరికట్టడంలో సిసిపిఎస్ ఉత్తమంగా పనిచేస్తుందని, ఈ సంవత్సరం 34కేసులు నమోదయ్యాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్రగ్స్ అరికట్టడం మీద ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని, ఇందులో భాగంగా ఈ సవత్సరం 421 కేసులు నమోదు చేసి 954మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ పరిధిలో డ్రగ్స్ మీద పటిష్ట చర్యలు తీసుకుంటున్న కారణంగా గతంలో మాదిరిగా సరఫరాదారులు పెద్దమొత్తంలో రవాణా చేయకుండా చిన్నచిన్న మొత్తాల్లో చేస్తున్నారని, వీటిని సైతం విజయవంతంగా చేధిస్తున్నామని అన్నారు. మొత్తం 24.92కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్‌ను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు మర్డర్ ఫర్ గెయిన్, డెకాయిటీ కేసుల్లో వంద శాతం చేధించామని, 101 దొంగతనాల కేసుల్లో 84 కేసులను పరిష్కరించామన్నారు. మొత్తం 121 హత్య కేసుల్లో 115 కేసులను సాల్వ్ చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం 163 పిడిఎస్ బియ్యం రవాణా కేసులను నమోదు చేశామన్నారు. సెల్‌ఫోన్ చోరీలను చేధించి 7967 సెల్‌ఫోన్లను యజమానులకు అందజేశామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గతం కంటే స్వప్పంగా తగ్గాయని, ప్రాణనష్టం చోటుచేసుకున్న ప్రమాదాలు 2023లో 812 నమోదు కాగా, ఈ సంవత్సరం 805 నమోదయ్యాయని, ప్రాణనష్టం లేని ప్రమాదాలు పెరిగాయని తెలిపారు. సైబరాబాద్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా మోటర్ సైకిలిస్టులు 465, పాదచారులు 261మంది ప్రమాదాల్లో మృతిచెందినట్లు తెలిపారు. ట్రాఫిక్‌ను ఉల్లంఘించిన వారిపై ఛలానాలు నమోదు చేస్తున్నామని, ఇందులో స్పాట్ ఛలానాలు 6.85 లక్షలు, ఈ ఛలానాలు 15.74లక్షలతో మొత్తం 111కోట్ల రూపాయల జరిమానా విదించినట్లు తెలిపారు. సైబరాబాద్‌లో ఈ సంవత్సరం నుంచి ఈఓడబ్ల్యు పోలీస్ స్టేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పనిచేస్తున్నామని, మొత్తం 90 కేసులు నమోదయ్యాయని అన్నారు. ఇందులో 203మందిని అరెస్టు చేసి 30కోట్ల నగదును ఫ్రీజ్ చేయడంతో పాటు 5.29కోట్ల విలువైన ఆస్థులను జప్తు చేశామన్నారు. మహిళలు, చిన్నారుల మీద జరిగిన అఘాయిత్యాల్లో ఈ సంవత్సరం 81 కేసులు, 1613 పెట్టి కేసులు నమోదు చేయడంతో పాటు 1633మందిని కౌన్సిలింగ్ చేశామన్నారు. షీటీమ్స్ అద్భుతంగా పనిచేసిందని, 1470మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో పాటు 9 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు. సైబరాబాద్ పోలీసుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు వినీత్, కోటిరెడ్డి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, నరసింహ, సృజనా, శ్రీబాలా, ఎల్‌సి నాయక్, శ్రీనివాస్, శోభన్‌కుమార్, సంజీవ్, సాయికుమార్, ఏడిసిపిలు జయరాం, శివకుమార్, వీరన్న, షమీర్, రవిచందన్‌రెడ్డి, రవికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సైబరాబాద్ కమీషనర్, అధికారులు

## బైక్‌లపై వెళ్లేవారికి హెచ్చరిక

-రాబోయే 20 రోజులు జాగ్రత్త..! -మెడకు మాంజా తగిలి తీవ్ర గాయం

-మరొకరి చేతికి గాయం..ఆస్పత్రికి తరలించిన స్థానికులు

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** సంక్రాంతి అనగానే గాలిపటాలు ఎగురవేయడం, మాంజా, చరాక్ ఇవే గుర్తుకొస్తాయి. అరే.. ఈసారి ఫుల్ పతంగులు ఎగిరేద్దాం అనుకుంటూ ప్లాన్స్ వేసుకుంటుంటారు చాలా మంది. ఈ పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేయడం ఎంత ఆనందాన్నిస్తుందో, దానికి ఉపయోగించే మాంజా అన్ని చేదు అనుభవాలను మిగులుస్తుంది. గాలిపటాలు ఎగురవేశాక ఆ మాంజాలు రోడ్లపై ఉంటాయి. వాటి వల్ల వాహనాలు నడిపే వారికి అవి కనిపించక, అవి మెడకు చుట్టుకుని మరణించిన ఉదంతాలు చూస్తూనే ఉంటాం. మరి కొందరు అలా తాకి తీవ్ర గాయాలపాలైన ఘటనలూ చూశాం. అలాంటి ఘటనే హైదరాబాద్ నాంపల్లిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం మహమ్మద్ రియాన్, మహమ్మద్ ఆదిల్ ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై ఆసిఫ్‌నగర్ నుంచి నాంపల్లి వైపు వెళ్తున్నారు. దేవునికుంట హిందూ స్మశాన వాటిక వద్ద అనుకోకుండా చైనా మాంజా గొంతుకు తగిలి తీవ్ర గాయమైంది.



వెనకాల కూర్చున్న మహమ్మద్ ఆదిల్ చేతికి గాయమైంది. వెంటనే స్థానికులు గాయపడ్డ వారిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారికి చికిత్స అందించగా, ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డారు. ఈ క్రమంలోనే సంక్రాంతిని పురస్కరించుకుని ద్విచక్ర వాహనదారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్లపై వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మాంజాతో ప్రాణాలు పోయే అవకాశం ఉండటంతో, గాలిపటాలు ఎగురవేసే వారూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పండుగ పేరిట ఇతరుల ప్రాణాలకు ముప్పు తేవొద్దని హెచ్చరిస్తున్నారు.

## విద్యార్థులు అన్ని మతాలను గౌరవించాలి



గాయత్రినగర్‌లోని జెన్‌నెక్ట్స్ పాఠశాలలో సెమ్మి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు.

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 24, ప్రభాతవార్త :** విద్యార్థులకు మన సాంస్కృతి సాంప్రాదాయాలతో పాటు అన్ని మతాలను గౌరవిస్తూ ఆయా వేడుకలను వాటి ప్రాముఖ్యతలను తెలియజేయడం జరుగుతుందని జెన్‌నెక్ట్స్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీలత అన్నారు. గాయత్రి నగర్‌లోని జెన్‌నెక్ట్స్ స్కూల్‌లో మంగళవారం సెమ్మి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు బాలఏసు జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన క్రిబ్(పశువుల కొటం) ఎంతగానో ఆకట్టుకుంది. ఇతరుల పట్ల ప్రేమానురాగాలను చూపడంతో పాటు శాంతి, దయ, కరుణ వంటి వాటిని ఏసుక్రీస్తు తెలియజేశారని ఈ లోకంలో పాపులను క్షమించేందుకు లోకరక్షకుడిగా ఏసుక్రీస్తు జన్మించారని ఈ వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఘనంగా జరుపుకుంటారని అన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల సియివో జితేంద్ర, మానేజింగ్ డైరెక్టర్ మల్లిఖార్జున్, ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గుండం బాలాజీ బ్రహ్మోత్సవాలు



గుండంలో స్వామి వారి చక్రస్నానం

**అల్వాల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** దేవుని అల్వాల్‌లోని చారిత్రాత్మకమైన గుండం బాలాజీ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు ఆఖరి రోజు స్వామి వారికి హవనము, పూర్ణాహుతితో పాటుగా ఆలయ గుండంలో చక్రస్నానం క్రతువును పండితులు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాదం సాయంత్రం శ్రీ పుష్పయాగం, ద్వాదశ ఆరాధనతో ఉత్సవాలకు ముగింపు జరిగింది.

## ఉద్యమంలో పోరాడిన కవులు, గేయ రచయితలకు సన్మానం

-ఉద్యోగుల హెల్త్‌స్కీం అమలు కోసం సిఫార్సు చేస్తా: ఎమ్మెల్సీ కోదండరాం



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న మహిళా పెన్షనర్ల ఫోరం సభ్యులు

**గచ్చిబౌలి, డిసెంబరు 24 ప్రభాతవార్త** తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన కవులు, గేయ రచయితలు, ప్రముఖులను తెలంగాణ ప్రభుత్వ మహిళా పెన్షనర్ల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గచ్చిబౌలి లోని టిఎన్‌జిఒ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, గేయ రచయిత అందెశ్రీ, రచయిత, పాత్రికేయులు పాశం యాదగిరి, కవి, సినీగేయ రచయిత జయరాజ్, శిల్పి ఎక్కా యాదగిరి రావులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం మరో ఉద్యమానికి నాంది కలికే విధంగా స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత హెల్త్ స్కీం అమలు అయ్యే విధంగా ప్రభుత్వానికి సిఫారు‌్స చేస్తానని అన్నారు. అందెశ్రీ మాట్లాడుతూ ఏ ఉద్దేశ్యంతో మనం తెలంగాణను సాధించుకున్నామో దానికి విరుద్ధంగా గత 10 సంవత్సరాలుగా మోసగించబడ్డామని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ మహిళా పెన్షనర్ల ఫోరం చైర్‌పర్సన్ ఉమాదేవి, కన్వీనర్ ఎస్‌ఎంఎల్ నాగమాంబ, కో చైర్‌పర్సన్ ధనలక్ష్మిలతో పాటు శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ టిఎస్‌పిఎస్‌సి సభ్యులు విఠల్, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, తెలంగాణ జెఏసి నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంట్రెక్ట్ మజ్దూర్ మహాసంఘ్ సర్వసభ్య సమావేశం

**చిక్కడపల్లి డిసెంబరు 24 ప్రభాతవార్త:** హర్యానా రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతకు, వేతనంతో కూడిన జీవో జారీ చేసిన విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే తరహాలో కాంట్రాక్ట్ కార్మికులను ఆదుకోవాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యదర్శి వి.రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని తెలంగాణ కాంట్రెక్ట్ మజ్దూర్ మహాసంఘ్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దాదాపు వంద మంది కార్మికులు పాల్గొన్నారు. రాధాకృష్ణ మాట్లాడుతూ హరియాణా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రెక్ట్ కార్మికులకు ఉద్యోగభద్రత, సామజిగా భద్రత, వేతనములో పెరుగుదల చేస్తూ జీవో వల్ల అక్కడి కార్మికులకు ఎంతోమేలు జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంట్రెక్ట్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షుడు రంగారావు, బిఎంఎస్ సీనియర్ నేత వెంకటేశం గారు. అల్ ఇండియా కాంట్రెక్ట్ లేబర్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణన్, కాంట్రెక్ట్ లేబర్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్, ఎ.శంకర్, ఎ. రాము తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## 27న రెండు నవల ఆవిష్కరణ

**సైఫాబాద్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** ఇందిరాపార్కు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని సాధిక్ వేదిక వద్ద ఈ నెల 27వ తేదీ సాయంత్రం తాను రచించిన రెండు నవల ఆవిష్కరణ, పరిచయం కార్యక్రమం జరుగుతుందని రచయిత డా.సంధ్యావిప్లవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. సాయంత్రం 4 గంటలకు 'అరుణిమ' నవలను బిసి కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు ఆవిష్కరిస్తారని, ముఖ్య వక్తలుగా డా.కోయి కోటేశ్వర్‌రావు, పివోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ పాల్గొంటారని, రాత్రి 7 గంటలకు త్రికాల నవల ఆవిష్కరణ జరుగుతుందని, ముఖ్యఅతిధులుగా ప్రముఖ పాత్రికేయులు సతీష్‌చందర్, ప్రొఫెసర్ సి.కాశీం పాల్గొంటారని చెప్పారు.

## రియల్ ఎస్టేట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా : ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

**చిక్కడపల్లి డిసెంబరు 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. సోమవారం తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ సుమారు 20 శాతం యువత ఉపాధి పొందుతున్న రియల్ ఎస్టేట్ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని ఆ దిశగా మీరు చేసే సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తానని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల కమిటీలను ఏర్పాటు చేసి అసోసియేషన్ను బరోపేతం చేద్దామని అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఏం నరసయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము రియల్ ఎస్టేట్ రంగాన్ని గుర్తిస్తూ వ్యాపారస్తులకు ఏజెంట్లకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ,రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్న పేద అసోసియేట్లకు ఆరోగ్య కార్డులు అందజేయాలని కోరారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉండి వివిధ రంగాలలో సమాజ సేవ చేస్తున్న గ్రేటర్ ప్రాజెక్ట్స్ ఎండి సయ్యద్ ఇమామ్, కరుణాకర్లకు అసోసియేషన్ తరపున జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దిరాజు, శ్రీధర్, కార్యదర్శులు లక్ష్మణరావు, బొమ్మ వెంకటేశ్వర్లు, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రహీముద్దీన్ రవీందర్ గౌడ్ , రియాజ్,కాటేపల్లి జనార్ధన్ ,సెల్ వెంకన్న, నిర్మలారెడ్డి ,సుజాత ,వనజ,, రాజిరెడ్డి, సంతోష్, కరుణాకర్, పేరం వెంకటేశ్వర యాదవ్, తివారి, వెంకటేష్ గౌడ్, జైపాల్ రెడ్డి, కాకునూరు సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థుల మరణాలకు స్పందించని కాంగ్రెస్ సర్కార్

-దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



ప్రసంగిస్తున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్

**చిక్కడపల్లి డిసెంబరు 24 ప్రభాతవార్త:** అల్లు అర్జున్ విషయం పైన రాజకీయాలు మానుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేసారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో కృష్ణస్వరూప్ మాట్లాడారు. ప్రభుత్వ గురుకుల పాఠశాల. కాలేజీ ల్లో ఫడ్ పా యిజన్ తో చాలా మంది చనిపోతున్నా రేవంత్ రెడ్డి మంత్రులు ఎటువంటి చర్యలు తీసికొలేదని.. వారి నిరక్ష్యం వలన ఇప్పటి వరకూ 48 వరకూ దళిత బిడ్డలు ప్రాణాలు పోయినా అసెంబ్లీ లో ప్రస్తావన చేయకపోవడం దళితుల పట్ల కుల వివక్షత అని విమర్శ చేసారు. గురుకులాల్లో అనుమాస్పద మరణాలు. ఆత్మ హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం యంత్రాంగం. మ్మెల్యే. మంత్రులు నోరు మెదపలే దన్నారు. ఈ వన్నీ సర్కార్ హత్యాలెన్నారు. సంక్షేమ శాఖ అధికారులు పత్తా లేకుండా పోయారన్నారు. ఈ మరణాలు పైన జాతీయ మానవ హక్కుల కమిషన్. జాతీయ ఎస్సీ. ఎస్టీ. మహిళ కమిషన్ లు తక్షణమే తెలంగాణ లోని అన్ని గురుకులాల్లో సందర్శించి విచారణ చేయాలని దళిత విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని కృష్ణ స్వరూప్ విజ్ఞప్తి చేసారు.సినీ హీరో అల్లు అర్జున్ సంధ్య థియేటర్ ఘటన ను తరుచూ ప్రస్తావన చేసి ప్రజల ద్రుష్టి మలచ్చుదానికి సీఎం రేవంత్ రెడ్డి. మంత్రులు నాటకాలు ఆడుతున్నారని ఆరోపణలు చేసారు. కనీసం మృతురాలి కుటుంబం సభ్యులను కానీ ఆసుపత్రి లో మృత్యువుతో పోరాడుతున్న బాలుడు శ్రీ తేజ ను పరామర్శించని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ లో మొసలు కన్నీరు కారుస్తున్నారని విమర్శ చేసారు. ఈ కార్యక్రమం లో నేతకాని మహర్ కుల సంఘము రాష్ట్ర అధ్యక్షులు గవ్వల. శ్రీకాంత్. దీటిశి పార్టీ రాష్ట్ర నాయకులు రాంవీదర్. నగర నాయకులు మద్దెల ప్రవీణ్ కుమార్. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

-రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్



తూనికలు కొలతశాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ డిఎస్ చౌహాన్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 24,ప్రభాతవార్త:** వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహనా కల్పించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ డి ఎస్ చౌహన్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 1986 డిసెంబర్ 24 న అమలులోకి వచ్చిందని అలాగే వినియోగుదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వినియోగదారుల ఫోరమ్స్ చక్కగా పనిచేస్తున్నాయని అన్నారు. డిజిటల్ విధానం, వర్చువల్ విచారణాల ద్వారా వినియోగదారులకు సత్వర న్యాయం అందేలా సంఘాలు పనిచేయాలని సూచించారు. వినియోగదారులు ఆహార పదార్దాలు, నగలు, ఇతర ఏ వస్తువైన కొనుగోలు చేసేటప్పుడు ధర, నాణ్యతా ప్రమాణాలు తెలుసుకొని కొనుగోలు చేయాలని అన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే సత్వరమే వినియోగదారుల ఫోరమ్ లో అర్జీ దాఖలు చేసి న్యాయ పరంగా నష్ట పరిహారం పొందాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల హక్కులు, చట్టాలపై అన్ని వినియోగదారుల సంఘాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయని అలాగే ప్రజలతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులలో కూడ వినియోగదారుల చట్టాలపై చైతన్యం కల్పించాలని అన్నారు. ముఖ్యాంగా ఆహార తనిఖీలలో అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టలని అన్నారు. వినియోగదారులు ఎక్కడకూడా నష్టపోకుండా నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని నకిలీ వస్తువుల మోసాల నుండి బయటపడాలంటే వినియోగదారులలో చైతన్యం అవసరమని అన్నారు..అనంతరం వినియోగదారుల చట్టాలపై ఉపన్యాసం ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందచేసి అభినందించారు. అంతకు ముందు తునికల కొలతల శాఖ ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువుల స్టాల్ లను సందర్శించి అధికారులకు దిశానిర్దేశ్యం చేసారు.ఈ సమావేశంలో డిసిఎస్ఓ రమేష్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అరుణ్ సాయి, తునికాల కొలతల అధికారి శివానంద్, ఆరోరా కళాశాల ప్రొఫెసర్ అర్జున్ రావు, వివిధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్, కిసాన్ దివస్ సెలబ్రేషన్స్..



క్రిస్మస్, కిసావ్ దివాస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

**జీడిమెట్ల, డిసెంబర్ 24, ప్రభాతవార్త** టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో క్రిస్మస్, కిసావ్ దివాస్ సెలబ్రేషన్స్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. టివిఆర్ మోడల్ స్కూల్ అపురూప కాలనీ, సత్యవాణి విద్యా నికేతన్ ఎస్ఆర్ నాయక్ నగర్ స్కూల్స్‌లలో టివిఆర్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రిస్మస్ పండగ సందర్భంగా సత్యవాణి విద్యానికేతన్‌లో కార్నివాల్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి, ఫాదర్ ప్రభాకర్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. రకరకాల స్నాక్స్ ఇంటి వంటతో సమానమైన ఆహార పదార్థాలను స్కూల్లోనే తయారు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచి ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ కోటిరెడ్డి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

### హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

**దుండిగల్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** ఓ యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం, రాయిలపూర్‌కు చెందిన మాదాసు సందీప్‌గౌడ్(30) ఈనెల 21న దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహాదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీలోని నిర్మానుష్య ప్రదేశంలో హత్యకు గురైయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును చేపట్టి మృతుడి సోదరుడు సంతోష్‌గౌడ్, స్నేహితుడు శేఖర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. తన తమ్ముడితో ప్రాణహాని ఉందని బావించి తనను అడ్డుతొలగించుకోవాలకున్నాడు. దీంతో స్నేహితుడు శేఖర్ సహాయంతో సందీప్‌గౌడ్‌ను సాయినాథ్ సొసైటీ వద్దకు పిలిపించుకున్నాడు. మద్యం సేవించిన అనంతరం సంతోష్ తనతో తెచ్చుకున్న ఇనుపసుత్తితో సందీప్‌గౌడ్ తలపై మోది హత్య చేశాడు. హత్యకు పాల్పడిన సంతోష్, సహకరించిన శేఖర్ ఇద్దరు నిందితులు నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## విద్యార్థులు క్రీడలలో చురుకుగా పాల్గొనాలి

-కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్



కార్యక్రమంలో పాల్గొన్న కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్

**చార్మినార్,డిసెంబరు 24 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడ చురుకుగా పాల్గొనాలని కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయికిరణ్ అన్నారు.కిషన్‌బాగ్‌లోని తమందో కరాటే మార్టియల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు నిత్యం ఆడటం వల్ల ఎంతో ఉత్సాహంగా ఉంటామని,విద్యార్దులు చదువుతో పాటు ఆటలకు కూడ తగిన ప్రాధాన్యత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్దులకు కరాటే ట్రాక్ సూట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ మీర్జాబేగ్‌లు పాల్గొన్నారు.

### దొంగతనం కేసులో భార్యాభర్తలు అరెస్ట్

**చార్మినార్,డిసెంబరు 24 ప్రభాతవార్త :** పాతబస్తీ రంనాస్‌పురలోని ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగతనం చేసిన కేసులో కాలఫత్తర్ పోలీసులు భార్యాభర్తలిద్దరిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.నింధితుల వద్ద నుంచి దొంగతనం చేసిన పదహారు తులాల బంగారం ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఫలక్‌నుమా ఏసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫలక్‌నుమా ఏసిపి ఎం.ఎ.మాజిద్,కాలాఫత్తర్ సిఐ మహ్మద్ ఆసిఫ్‌తో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బండ్లగూడకు చెందిన భార్యాభర్తలైన జకియా సుల్తానా (46), మహ్మద్ అబ్దుల్ సలీం (47)ఈ నెల 14వ తేదీన యాకుబ్ ఖురేషీ ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న పదహారు తులాల బంగారం ఆభరణాలను దొంగలించి పరారీ అయ్యారు.ఇంటి యజమాని ఖురేషీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.కాగా భార్యాభర్త లిద్దరూ మంగళవారం పాతబస్తీ చందూలాల్‌బారాదరిలో అనుమానస్పదంగా సంచరిస్తున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.నింధితులైన జకియా సుల్తానా,మహ్మద్ అబ్దుల్ సలీంలు వద్ద నుంచి పదహారు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.కాగా పాత నేరస్థులైన వీరిద్దరిపై భవానీ నగర్, మాదన్నపేట్,సంతోష్‌నగర్,కామాటిపుర పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని ఏసిపి ఎం.ఎ.మాజిద్ వెల్లడించారు.ఈ కేసును కాలాఫత్తర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నార్సింగిని ఆదర్శ మున్సిపల్‌గా మార్చాం : చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

### - రూ.21.41.కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం



నార్సింగి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ నాగపూర్ణ, వైస్ ఛైర్మన్ విజయ్‌బాబు, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలు.

**నార్సింగి, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీని రంగారెడ్డి జిల్లాలోనే ఆదర్శ మున్సిపల్‌గా మార్చామని చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ నాగపూర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు గాను కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులంతా కలిసి రూ. 21.41.కోట్ల పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీలో భూగర్భ డ్రైనేజి, మంచి నీరు, వీధిదీపాలు, సీసీ రోడ్ల సమల్యలను 90.శాతం వరకు తీర్చడం జరిగిందన్నారు. పాలకవర్గ సభ్యులందరి సహకారంతో అన్ని డివిజన్లలో సమానంగా అభివృద్ధి పనులు చేశామని, అభివృద్ధి విషయంలో కుల,మత,పార్టీలకు అతీతంగా వ్యవహరించామన్నారు. తోటి కౌన్సిలర్లు, అధికారుల బృందం అంతా కలిసి అభివృద్దిని పరుగులు పెట్టించామని నాగపూర్ణ వివరించారు. ప్రజలకు ఏది అవసరమో అది పూర్తి చేశామన్నారు. ఎన్నికల వేళ నార్సింగి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతలలో చేసి చూపించామని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ గోపాల విజయ్‌బాబు, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు కె.ఉషారాణి, అరుణజ్యోతి, లక్ష్మీ ప్రవళిక కిరణ్, గోపాల సునీత గణేష్, అమరేందర్‌రెడ్డి, యాదమ్మ,శివారెడ్డి,లంకల పద్మ, పత్తి శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ప్రజలంతా చెత్తను ఆటోల్లోనే వేయాలి : కమిషనర్



బండ్లగూడ కార్పోరేషన్‌లో ప్రజలకు చెత్త డబ్బాలు పంపిణీ చేస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర

**నార్సింగి, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని ప్రజలంతా విధిగా తమ ఇళ్లలో వెలువడే చెత్తను ఆటోలలోనే వేయాలని కమిషనర్ శరత్ చంద్ర పేర్కొన్నారు. మంగళవారం కార్పోరేషన్ పరిధిలోని 13,14,15.డివిజన్ల పరిధుల్లో శానిటేషన్ సిబ్బందితో కలిసి కమీషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు తడి,పొడి చెత్తలను వేసేందుకు వీలుగా రెండెసి టబ్బులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలోనే తడి,పొడి చెత్తను వేరు చేసి ఆటోల్లో వేయాలని సూచించారు. ఇళ్లు, ఇంటి పరిసరాలలో చెత్త, నీరు నిలువ ఉండకుండా ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. ఎక్కడ చెత్త,నీరు నిలువ ఉంటుందో అక్కడ అంటు వ్యాధులను వ్యాపింపచేసే దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల సర్వేను కూడా కమీషనర్ శరత్‌చంద్ర పరిశీలించారు. లబ్దిదారులను ఇంటింటికి తిరిగి గుర్తించడం జరుగుతుందని, అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా మావంతు కృషి చేస్తున్నామని కమీషనర్ శరత్‌చంద్ర వివరించారు. ఈ కార్యమ్రకంలో శానిటరీ జవాన్లు రామాంజనేయులు, సుభాష్, మల్లేష్, రాము, వార్డు ఆఫీసర్లు శంకరయ్య, కిష్టయ్య, బిల్ కలెక్టర్లు జహంగీర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

**సైఫాబాద్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** తమ డిమాండ్ల సాధన కోసం గత 14 రోజులుగా నిరవధిక నిరసన కార్య క్రమం నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు చైతన్య మహిళా సంఘం మద్దతు ప్రకటిం చింది. తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరవధికంగా నిరసన కార్యక్ర మాలు చేపడుతున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోకపోవ డం అన్యాయమని సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో-కన్వీనర్లు రాధ, శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. గడిచి న అసెంబ్లీ ఎన్నికల ముందు ఉద్యోగులు ఆందోళనా కార్యక్రమాలను నిర్వహిస్తుంటే ఆనాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారని, పదవిలోకి వచ్చి ఏడాది గడిచిందని, తక్షణమే వారి డిమాండ్లను అమలు చేయాలని వారు ఒక ప్రకట నలో పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

-నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి



బస్తీలలో పర్యటిస్తున్న తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 24 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలి పురం, న్యూ దుర్గా నగర్,బాబుల్‌రెడ్డి నగర్ బస్తీలలో రాజేంద్ర నగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు.బస్తీలలో కొత్తగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజి పైప్ లైన్, సిసి రోడ్ల పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.దుర్గానగర్‌లోని నాలాపై స్లాబు పనుల కోసం సంబంధిత ప్రాజెక్టు అధికారులతో కలిసి మాట్లాడటం జరిగిందని,బాబుల్ రెడ్డి నగర్‌లో రైన్ వాటర్ డ్రైనేజీ లైను అవసరం ఉన్న చోట పొడిగించి కొత్త రహదారిని వేసి పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి,వర్క్ ఇన్‌స్పెక్టర్ భాను,వాటర్ వర్క్స్ మేనేజర్ ఖాదర్,నాయకులు కృష్ణ ఎల్వీ రెడ్డి,జంగారెడ్డి, వెంకట రమణ, గుప్తా,మన్మోహన్ రెడ్డి,తలారి చిన్న,శ్రీ కాంత్ రెడ్డి, పాండు యాదవ్,కృష్ణా యాదవ్,రమేష్ రెడ్డి, శంకర్, గోపాల్ నాయక్,మధుసూధన్,శేఖర్‌లు పాల్గొన్నారు.

### రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

- న్యాయవాది పాదూరి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 24,ప్రభాతవార్త:** అల్లు అర్జున్ కేసు విషయంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది పాదూరి శ్రీనివాస్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు చేస్తున్నారని హీరో అల్లు అర్జున్ వెను ఓ మహా శక్తి ఉందని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ అరెస్ట్‌ను కొందరు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని పుష్ప సినిమాలో చేసినట్లుగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను కుప్ప కూల్చాలని చూస్తున్నట్లు తెలిపారు. ఈ వారం రోజుల్లోనే బీఆర్ఎస్, బీజేపీలు తాము అనుకున్న పనిని చేయాలనుకుంటున్నాయన్నారు. అల్లు అరవింద్ ఫ్యామిలీని కాపాడటానికి ప్రతిపక్షాలు ఉన్నాయని.. పక్క రాష్ట్రాల నుంచి సైతం అల్లు అర్జున్‌కు మద్దతిస్తున్నారని చెప్పుకొచ్చారు. కానీ, బాధిత కుటుంబానికి అండగా నిలబడాల్సింది తెలంగాణ సమాజమేనని శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. వీరికి అండగా నిలిచిన వారే నిజమైన తెలంగాణ వాదులు అని పేర్కొన్నారు. సినిమా ఇండస్ట్రీ పక్షాన నిలబడిన వారు తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోతారంటూ అడ్వకేట్ శ్రీనివాస్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## మాజీ కేంద్రమంత్రి మల్లిఖార్జున్‌కు కాంగ్రెస్ నేతల నివాళి



మాజీ కేంద్రమంత్రి మల్లిఖార్జున్‌గౌడ్ సమాదివద్ద పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులు అర్పిస్తున్న జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 24 ప్రభాతవార్త** దేశ రాజకీయాలలో తనదైన పాత్ర పోషించి ప్రజా సేవలో అందరికీ ఆదర్శంగా నిలిచిన స్వర్గీయ డాక్టర్ మల్లిఖార్జున్ చిరస్మరణీయులని శేరిలింగంపల్లి నియోజక వర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మాజీ కేంద్రమంత్రి,ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ పీసీసీ అధ్యక్షులు, స్వర్గీయ డాక్టర్ మల్లిఖార్జున్ గౌడ్ 21 వ వర్ధంతిని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్లలోని ఆయన సమాది వద్ద శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.స్వర్గీయ మల్లిఖార్జున్ గౌడ్ సమాది వద్ద పుష్పగుచ్చాలను సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. 1969లో తొలి తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడు మల్లిఖార్జున్ గౌడ్, దేశస్థాయిలో గర్వించదగిన నాయకుడిగా ఎదిగి కేంద్రమంత్రిగా పనిచేసి ప్రజలకు ఎన్నో సేవలు చేశారన్నారు. వారి ఆశయసాధనలో భాగంగానే వారి స్ఫూర్తితో తనవంతు ప్రజాసేవ చేస్తున్నట్లు జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు, శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ సభ్యులు, కార్యకర్తలు, జగదీశ్వర్‌గౌడ్ యువసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## శాంతినగర్‌లో ఘనంగా 23వ అయ్యప్ప మహా పడిపూజ



స్వామికి హారతి ఇస్తున్న గురుస్వాములు

**తార్నాక, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** శాంతినగర్‌లో గురుస్వామి ఈశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం 23వ అయ్యప్ప పడి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామికి పాలు, పెరుగు, తేనె వంటి 18 రకాలైన పదార్థాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, హారతి వంటి పూజా కార్యక్రమాలను భక్తితో ఆచరించారు. అయ్యప్ప గీతాలు, భజనలతో మాలధారులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. స్వామియే శరణం అయ్యప్ప అనే నామ స్మరణతో శాంతినగర్ ప్రాంతమంతా ఆధ్మాతిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గురు స్వాములు రమేష్, సాయి, ప్రమోద్, రవి, నర్సింహా, రాజు, ఎల్ఎల్‌బీ శ్రీనివాస్ గౌడ్, శ్రీను, నరేందర్ మహేష్‌తో పాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నిరసన ర్యాలీకి తరలివెళ్లిన లష్కర్ నేతలు

**తార్నాక, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన కామెంట్లను వ్యతిరేకిస్తూ నగరంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన ర్యాలీకి పలువురు తరలివెళ్లారు. సికింద్రాబాద్ నియోజక వర్గం ఇంచార్జీ ఆదం సంతోష్ కుమార్, కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. లాలాపేట్, శాంతినగర్ నుంచి వెళ్లిన వారిలో నాయకులు అనిరుద్, విషాల్, సుజన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిల్మ్ ఇండస్ట్రీ ఎపికి తరలివెళ్లాలి : డిజాక్ చైర్మన్ ప్రొ.గాలి



మాట్లాడుతున్న ప్రొ.గాలివినోద్‌కుమార్ సినీ ప్రముఖులు

**తార్నాక, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ వారిని అన్యాయం చేస్తున్న ఫిల్మ్ ఇండస్ట్రీ ఏపీకి తరలివెళ్లాలని డి...జాక్ చైర్మన్ ప్రొ.గాలివినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన తెలుగు ఫిల్మ్ డైరెక్టర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డా. కస్తూరి శ్రీనివాస్, మ్యూజిషియన్ యూనియన్ అధ్యక్షులు రమణ ఒటెటి, డా.భద్ర,డైరెక్టర్ విష్ణువర్ధన్‌తో తార్నాకలో మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 11 ఏండ్లు గడిచినా ఇక్కడే పరాన్న జీవుల్లా తిష్టవేసి ఇక్కడి కవులు, కళాకారులు,నిర్మాతలు,హీరో, హీరోయిన్లు, కార్మికుల అవకాశాలను దోపిడి చేస్తున్న ఆంధ్రా సినిమా ఇండస్ట్రీ వారు కొమన్ కాపిటల్ పీరియడ్ అయిపోయినా ఇక్కడే ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఏపీ సీఎం,డిప్యూటీ సీఎం రమ్మని పిలిచినా ఎందుకు వెళ్లడంలేదన్నారు. పుష్పా సినియా ప్రిమియర్ షోలో అల్లు అర్జున్ ఓవర్ యాక్షన్ కారణంగా బలి అయిపోయిన రేవతి కుటుంబానికి న్యాయం కోసం ఓ.యూ విద్యార్థులు ఆ హీరో ఇంటిపై దాడి చేశారని దానిని తాము పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. తెలం గాణ వారికి ఇండస్ట్రీలో అవకాశాలు ఇవ్వకుంటే తాము సహిం చబోమన్నారు.



చిక్కడపల్లిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

## వీధి వ్యాపారుల జీవనోపాధికి రక్షణ కల్పించాలి

### -ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

చిన్న, వీధి వ్యాపారస్తులకు జీవనోపాధికి రక్షణ కల్పించాలని కుకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల కెపిహెచ్బి కాలనీ 9వ ఫేజ్ నుంచి 5వ ఫేజ్ వరకు ఫుట్ పాత్‌లపై వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలకు దుకాణాలను డబ్బాలను తొలగించడం దౌర్భాగ్యమైన చర్య అని ఆయన ఆరోపించారు. మంగళవారం దుకాణాలు కోల్పోయిన బాధితులను ఆయన కలిశారు. పేద ప్రజల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక జిహెచ్ఎంసి, ట్రాఫిక్ అధికారులను ఉసి గొల్పి వారి జీవనోపాధికి ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇటువంటి చర్యలకు ఎప్పుడు పూనుకోలేదని ఆయన గుర్తు చేశారు. ప్రజా వ్యతిరేకానికి కాంగ్రెస్ పార్టీ పాల్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు మాజీ కార్పొరేటర్ బాబురావు సాయిబాబా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు



సెమి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దొడ్ల రామకృష్ణ గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

క్రిస్మస్ పండుగ సందర్భంగా 124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కమలమ్మ కాలనీ, పీజేఆర్ నగర్ కాలనీలలో సోమవారం రాత్రి నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్ధన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా దొడ్ల రామకృష్ణ గౌడ్ క్రిస్టియన్ సోదర సోదరీమణులకు, ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఇజ్రాయిల్, సత్యరాజ్, విక్టర్ ఇమ్మానుయేల్, దయానిధి, దేవదాస్, నాగభూషణం, సీమోను, ఏసుబాబు, రవీందర్, కరీమ్, బషీర్, ఖలీమ్, కోరా ముత్యాలరావు, సాయిబాబు, రాఘవులు, పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని కాపాడండి : బిక్షపతి యాదవ్

**నిజాంపేట్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

పాశ్చాత్య పబ్ కల్చర్ వద్దు మన సనాతన ధర్మమే ముద్దు మన సనాతన ధర్మాన్ని కాపాడండాలని నిజాంపేట బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జాతీయ, అంతర్జాతీయ స్కూల్లు, ఇంజనీరింగ్ కళాశాలలకు ఇతర విద్యాసంస్థలకు నిలయంగా ఉందన్నారు. ఆంధ్ర, తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా చదువు నిమిత్తం విద్యార్థులు వారి తల్లిదండ్రులకు దూరంగా వచ్చి ఇక్కడ వివిధ హాస్టల్లో , రూములలో ఉంటూ చదువుకుంటున్నారని తెలిపారు. విద్యాలయాలకు నిలయమైన ఇలాంటి ప్రదేశాలలో విషపు సంస్కృతిని వెదజల్లే పబ్బులను రెసిడెన్స్ ఏరియాలలో ఏర్పాటు చేయడం అది దాదాపు ఈ మూడు నెలల కాలంలోనే టకీలా, గోల్డెన్ బ్యారెల్, పెగ్గు బ్రో వంటి మూడు పబ్‌లకు ఎలా అనుమతి ఇచ్చారని అధికారులు, స్థానిక పాలకమండలిని ప్రశ్నించారు. విద్యార్థులు యువతలో ఈ విష పాశ్చాత్య సంస్కృతిని పెంపొందించడానికి అక్రమ అనుమతులు ఇస్తుంటే ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే వివేకనంద, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఎందుకు అడ్డుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన సనాతన ధర్మానికి తూట్లు పొడవడానికెన ప్రజలు మీకు అధికారాన్ని కట్టబెట్టిందని మండిపడ్డారు. ఇకనైనా పాశ్చాత్య విష సంస్కృతిని పెంపొందించే ఇలాంటి పబ్బులపైన ఉక్కు పాదం మోపి మన సనాతన ధర్మాన్ని కాపాడాలని ప్రజలు ఆశిస్తున్నారని అన్నారు.

## త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డిని కలిసిన సెయింట్ ఆంథోనీ విద్యా సంస్థ యాజమాన్యం



**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

కొంపల్లిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డిని పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు, క్రిస్టియన్ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సెయింట్ ఆంథోనీ విద్యా సంస్థ యాజమాన్యం మంగళవారం గవర్నర్ ఇంద్రసేన రెడ్డిని కలిసి, ఫిబ్రవరిలో జరిగే సెయింట్ ఆంథోనీ విద్యా సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. వారు తప్పకుండా పాల్గొంటానని హామీ ఇచ్చారు. వారిని మా విద్యా సంస్థలు తరుపున శాలువాతో సన్మానించి మొక్కను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నరిశెట్టి సుందర రాజు పాఠశాల డైరెక్టర్ పూదోట అరుల్ రాజు, జాతీయ బీజేపీ కార్యవర్గ సభ్యులు, మల్లవరపు ధన్ రాజు, నరిశెట్టి లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

## చిలకలగూడలో బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛ్‌భారత్



స్వచ్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

**సికింద్రాబాద్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద స్వచ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, పెద్ది రవీందర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మచ్చలేని మహా నాయకుడు, భారత రాజకీయ రంగంలో గొప్ప దేశభక్తి గల నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రెడ్డి, హరి, రవిప్రసాద్ గౌడ్ ప్రభుగుప్త, అనూష, మంజుల, సతీష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులకు సూచించారు. మంగళవారం పెట్ బషీరాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హౌసింగ్ బోర్డ్, విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసితో పాటు పలు విభాగాల అధికారులు, నియోజకవర్గంలోని దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్ పల్లి, బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల లబ్ధిదారులతో మౌళిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చి వారు ఆత్మగౌరవంతో బ్రతకాలనే ఆలోచనతో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ విశాలవంతమైన గదులతో కూడిన ఇండ్లను నిర్మించి ఇచ్చారన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు త్రాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం, రోడ్లతోపాటు ఇతర మౌలిక వసతుల పనులను వెంటనే పూర్తి చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు సంతోషంగా వారికి కేటాయించిన ఇళ్లలో నివాసం ఉండేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ఇప్పటికే బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని, రానున్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాన్ని కల్పించడంతోపాటు మౌలిక వసతులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల విజయ శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ ఎల్లకంటి శ్రీను, నల్లూరి కృష్ణ, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ యాదవ్, హౌసింగ్ బోర్డ్ ఇంజనీరింగ్ ఈఈ పీవీ. రవీందర్, డిఈలు మారుతి, నరసయ్య, విద్యుత్ శాఖ డిఈఈ సత్తెమ్మ, ఏఈ సిహెచ్. రమేష్, జిహెచ్ఎంసి ఈఈ లక్ష్మీ గణేష్, డిఈ పాపమ్మ, దుండిగల్ ఏఈ సురేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పలకు అన్న ప్రసాద వితరణ



అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేస్తున్న కార్పోరేటర్ చీరె దంపతులు.

**బేగంపేట డిశంబరు 24,ప్రభాతవార్త**

రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలో అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ చేసారు రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్ర దంపతులు.మంగళవారం రాంగోపాల్‌పేట డివిజన్ శ్రీవర్మ గార్డెన్‌లో ఆకుల ప్రతాప్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వా ములకు అన్న ప్రసాద వితరణ చేసారు.ఈ కార్యక్రమంలో కార్పోరే టర్ చీరె సుచిత్ర,చీరె సత్యనారాయణ(శ్రీకాంత్)లు పాల్గొన్నారు.

## అజాతశత్రువు అటల్ బిహారీ వాజ్‌పేయి

**నిజాంపేట్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

అటల్ బిహారీ వాజ్పేయి ఒక వ్యక్తి కాదు ఒక మహా శక్తి అని, దశాబ్దాల అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టి దేశానికి సుపరిపాలన అందించటానికి నడుము కట్టిన ఓ యోధుడని, ప్రతిపక్ష నాయకులతో కూడా పొగడబడటం వారి ఉన్నత వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనమని, కవిగా, రచయితగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కేంద్ర మంత్రిగా, ప్రధానమంత్రిగా దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించిన ఒక మహోన్నత శిఖరం అటల్ బిహారీ వాజ్పేయి అని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు కొనియాడారు. మంగళవారం అటల్ బిహారీ వాజ్‌పేయి 100 వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తు వారి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్పేయి గొప్ప నాయకుడని, దేశాభివృద్ధికి పాటుపడిన వ్యక్తి అని ఆయన చరిత్ర భారతదేశ యువతకు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. కవిత్వం, రాజకీయాలు, మానవతా విలువల సమ్మిళితంగా జీవించిన వాజ్పేయి జ్ఞాపకాలు అనేక తరాలకు ఆదర్శంగా మారాయన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

### -భయాందోళనలో స్థానికులు



ఓల్డ్‌పాటిగడ్డలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

**బేగంపేట డిశంబరు 24,ప్రభాతవార్త**

విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారినా సంబంధిత విద్యుత్‌శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బేగంపేట డివిజన్ ఓల్డ్‌పాటిగడ్డలో విద్యుత్‌స్తంభం అడుగుభాగం పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది.ఈ సమాచారాన్ని స్థానికులు విద్యుత్‌శాఖాధికారుల దృష్టికి తీసికెళ్లినప్పటికీ వారు స్పందించకపోవడంపై బస్తీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పెద్ద గాలి వస్తే విద్యుత్ స్తంభం పక్కకి ఒరిగిపోయి కిందపడే ప్రమాదం ఉందని,వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్‌స్తంభం కిందపడితే ఈ ప్రాంతంలో పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని బస్తీ వాసులు వాపోతున్నారు.ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని వెంటనే మార్చి కొత్త స్తంభాన్ని వేయాలని బస్తీ వాసులు కోరుతున్నారు.

## పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లించాలి



గోడపత్రికను విడుదల చేస్తున్న నేతలు

**సికింద్రాబాద్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ సర్పంచుల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రాష్ట్ర మాజీ సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. తమ గోడును వెళ్లబోసుకుంటు మంగళవారం గాంధీ ఆస్పత్రి వద్ద ఉన్న మహాత్మగాంధీ విగ్రహం మందు మాజీ సర్పంచులు గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని, సర్పంచులుగా గెలిచిన పాపానికి అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే ప్రభుత్వాలు పట్టించుకోకుండా, పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించిన తరువాతనే ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లాలని లేని పక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ సర్పంచుల ఏజేసీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగయ్య, గణేష్, మల్లయ్య, పూర్ణ చందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : షబ్బీర్ అలీ



బోయిన్‌పల్లి ఆసుపత్రి వార్షికోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తున్న షబ్బీర్ అలీ,జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబరు 24ప్రభాతవార్త:** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్య లు తీసుకుంటుందని, అదే విధంగా ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు లాభాలు ఆశించకుండా వైద్య సేవలు అందిస్తే మంచి గుర్తింపు వస్తుందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, మైనార్టీ శాఖల ప్రభుత్వ అడ్వైజర్ షబ్బీర్ అలీ తెలిపారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని వి.ఆర్. మల్టీస్పె షల్టీ ఆసుపత్రి 8వ వార్షికోత్స వ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బోయిన్‌పల్లిలో వి.ఆర్. ఆసుపత్రికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రోగులకు నమ్మకం కలిగే విధంగా వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను వి.ఆర్. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులుముప్పిడి మధుకర్, బల్వంత్ రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : రామక్రిష్ణ

**కంటోన్మెంట్,డిసెంబరు 24ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డుపరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. మంగళవారం 8వ వార్డు రీసాల బజార్ శాంతి నగర్ ప్రాంతాల్లో లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న రోడ్డు నిర్మాణం పనులను అయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో 8వ వార్డు బిజెపి అధ్యక్షుడు ఎన్.ఎస్.కిరణ్, బిజెపి నాయకులు శ్రీకాంత్, ధనుంజయ చారి, రాంచంద్రారెడ్డి, నట్రాజన్, పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వేతన ఒప్పందం కార్మికుల విజయం : చింతల నాగరాజు

**జీడిమెట్ల, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

పరిశ్రమలో పనిచేసే కార్మికులు యూనియన్ ద్వారానే తమ హక్కుల సాధించుకోవడం అభినందనీయమని నూతన వేతన ఒప్పందం కార్మికుల విజయమని ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు, ధర్మో కేబుల్ పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు చింతల నాగరాజు అన్నారు. మంగళవారం జీడిమెట్ల పారిశ్రామికవాడలో ధర్మ కేబుల్ కంపెనీలో నూతనంగా వేతన ఒప్పందము చేసుకోవడం జరిగింది. ఈ వేతన ఒప్పందము (డిసిఎల్) డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్ రాజు సమక్షంలో వేతన ఒప్పందము అగ్రిమెంట్ చేసుకోవడం జరిగింది. మూడు సంవత్సరాలకు గాను 10000 వేల రూపాయలు, ముగ్గురిని కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడం జరిగింది. అలాగే సంవత్సరానికి రెండు జతల డ్రస్సులు, రెండు జతలు బూట్లు, టూర్ అలవెన్స్, ఫ్యామిలీ మెంబర్‌కు సంవత్సరానికి 2 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ అలాగే ఒక నెల జీతం బోనస్ షిఫ్ట్ అలవెన్స్, వీడియో పాయింటు ఇస్తామని కంపెనీ యాజమాన్యం అగ్రిమెంట్ ద్వారా లిఖితపూర్వక హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ధర్మ కేబుల్ యూనియన్ అధ్యక్షులు చింతల నాగరాజు మాట్లాడుతూ ధర్మో కేబుల్ అన్ని యూనిట్లలో కన్నా టాప్ అగ్రిమెంట్ అని నాగరాజు అన్నారు. అగ్రిమెంటు మంచిగా అయినందున ధర్మో కేబుల్ యాజమాన్యాన్ని యూనియన్ అధ్యక్షులు నాగరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ వర్మ, హెచ్ఆర్ అడ్మిన్ మనోహర్ హెగ్డే, విప్పి ఆపరేషన్ మనోజ్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్స్, జనరల్ సెక్రెటరీ వెంకట్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు మచన్ ఖాన్, భాస్కర్ రెడ్డి, సిహెచ్ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పీకే మాలిక్ దాస్, ట్రెజరర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శ్రమజీవుల వృత్తులు కడగండ్లకు నిలువుటద్దం కశ్పి కావ్యం : ఆచార్య గౌరీశంకర్

**రవీంద్రభారతి, డిసెంబరు 24 ప్రభాతవార్త :** శ్రమజీవుల కడగండ్లను, వృత్తుల ఘనతకు నిలువుటద్దంలా అవధాని అవుసుల భానుప్రకాష్ రచించిన కశ్పి కావ్యముందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ అన్నారు. శ్రీవిశ్వభారతి సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశమందిరంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గౌరీశంకర్ విశిష్ట అతిథులు డా. కాంచనపల్లి, మౌనశ్రీమల్లిక్, భానుప్రకాష్, అప్పాల ప్రసాద్, దాస్యం సేనాధిపతి తదితరులతో కలిసి కశ్పి కావ్యాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఆచార్య వెంకటరెడ్డి అధ్యక్షోపన్యాసంలో ప్రస్తుత తరుణంలో వృత్తులను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, 23 వృత్తులపై, ఆయా వృత్తికారుల శ్రమజీవన సౌందర్యం వర్ణించేలా భానుప్రకాష్ కశ్పి కావ్యముందని ప్రశంసించారు. ప్రముఖ గీతరచయిత మౌనశ్రీమల్లిక్ కావ్యసమీక్ష చేస్తూ శతాబ్దాల సాహిత్యాఇన్న తరచిచూసినా అన్ని వృత్తులను వర్ణిస్తూ రాసిన



కశ్పి కావ్యావిష్కరణ కావిస్తున్న గౌరీశంకర్, వెంకటరెడ్డి, భానుప్రకాష్ తదితర అతిథులు

మరొకకావ్యం లేదని, ఇప్పుడు కశ్పి దాన్ని భర్తీచేసిందన్నారు. అన్ని వృత్తులవారి సాధకబాధకాలను కవితలుగా మలచిన భానుప్రకాష్ అభినందనీయుడని కొని యాడారు. ఈ సందర్భంగా 25మంది కవులు శ్రమ సం స్కృతిని తెలుపుతూ కవిసమ్మేళనం తమ కవితాగానం చేయగా, ఆరుగురు ప్రముఖులకు శ్రీవిశ్వభారతి పురస్కా రాల ప్రదానోత్సవం వైభవంగా జరిగాయి. కశ్పి సాహిత్య కార్యక్రమంలో పద్మజారాణి, కొండపల్లి నీహారిణి, రామ కృష్ణరాజు, విశ్వపతి, భూమయ్య, జ్యోత్స్న, పద్మప్రియ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి చొరవతో ఆర్టీసీ త్రిసభ్యకమిటీ ఏర్పాటు

### ప్రజాభవన్‌లో సంబురాలు చేసుకున్న ఆర్టీసీ కార్మికులు

**బేగంపేట డిశంబరు 24,ప్రభాతవార్త**

ప్రజావాణీ కార్యక్రమం చొరవతో ఆర్టీసీ త్రిసభ్య కమిటీ ఏర్పాటు కావడంపై మంగళవారం ఆర్టీసీ కార్మికులు మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో విజయోత్సవాలు నిర్వహించారు.500మంది ఆర్టీసీ కార్మికులు మంగళవారం తరలి వచ్చి సంబురాలు జరుపుకున్నారు. సీ.ఎం. రేవంత్‌రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రజావాణీ ఇంచార్జి డా.చిన్నారెడ్డి స్టేట్ నోడల్ అధికారి దివ్య లకు బాధిత ఆర్టీసీ కార్మికులు ధన్యవాదాలు తెలియజేసారు.మొబైల్‌ఫోన్ మాట్లాడుతున్నారని,బస్టాప్‌లో బస్సు ఆపలేదని,విధులు సరిగా నిర్వహించడంలేదనే చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి తమను ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని బాధిత ఆర్టీసీ కార్మికులు సీ.ఎం.ప్రజావాణీలో రెండు నెలల క్రితం దరఖాస్తు అందించారు.వారి సమస్యను తెల్సుకున్న ప్రజావాణీ ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి ,స్టేట్ నోడల్ అధికారి దివ్యలు



ప్రజాభవన్ లో హర్షం వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసికెళ్లారు.ఉద్యోగాల నుంచి తొలగించిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.తమ ఉద్యోగాలను సత్వరమే ఇప్పించాలని ఈ మేరకు త్రిసభ్య కమిటీ కృషి చేయాలని బాధిత ఆర్టీసీ కార్మికుల ప్రతినిధులు దుగ్గు రాజేందర్,సుంకరి బాగేశ్వర్,కుమ్మరి గంగాధర్ ,చెరుకు భూమేష్,చెక్క సంపత్ ,వై.ప్రకాష్,ఎలమర్తి ప్రసాదరావులు మంగళవారం ప్రజావాణీలో విజ్ఞప్తి చేసారు.

## అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

### : ఎమ్మెల్యే శ్రీగణేష్



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబరు 24ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ డిమాండ్ చేశారు. అమిత్‌షా వాఖ్యలకు నిరసనగా మంగళవారం ఏఐసిసి పిలుపు మేరకు ట్యాంక్ బండ్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యే శ్రీగణేష్ పాటువందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి హోదాలో ఉండి అంబేద్కర్‌ను అవమానపర్చే విధంగా అవమానపర్చడం సరైంది కాదన్నారు. కోట్లాధి మంది జీవితాల్లో వెలుగులు నింపిన భారత రాజ్యాంగ నిర్మాతను దేశ ప్రజలంతా గౌరవిస్తున్నారన్నారు. అందు వల్ల ఆయన చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు కొమురమ్మ, గంట రాజు సాగర్ ముప్పిడి మధుకర్, రాజేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలి : ఎంపి లక్ష్మణ్



మారేడ్‌పల్లి షెనాయ్ ప్లే గ్రౌండ్‌లో టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబరు 24ప్రభాతవార్త:**

క్రీడలు దేశ ప్రతిష్టను కాపాడుతుందని, క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా రంగాల్లో రాణించాలని రాజ్య సభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. భారత మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారి వాజ్‌పేయ్ శత జయంతిని పురస్కరించుకొని బిజెవైఎం మహంకాలి జిల్లా సింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మారేడ్‌పల్లి షెనాయ్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్స్ పోటీలను ఆయన ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావ్, బిజెవైఎం గ్రేటర్ అధ్యక్షుడు మద్దూరి శివాజీ, బిజెవైఎం నాయకులు అల్లం శివకుమార్ యాదవ్, టోపి శంకర్, బానుక మల్లికార్జున్, నాగభూషణ్ రెడ్డి, బి.ఎన్. శ్రీనివాస్, శివయాదవ్, వీరవర్ధన్ గౌడ్, చరణ్, శ్యామ్, కార్తీక్ ,ప్రవీణ్, కిషన్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి శ్రద్ధానందకు ఘన నివాళులు..



మున్షీరామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వక్తలు

**నిజాంపేట్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మున్షీరామ్‌గా జన్మించి స్వామి శ్రద్ధానంద సరస్వతిగా అవతరించి, హిందూ ధర్మాన్ని ఉద్ధరించే క్రమంలో దుండగుల తూటాలకు బలైన స్వామి శ్రద్ధానంద వర్ధంతి సందర్భంగా ప్రగతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు హిందూ బంధువులు వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బలవంతంగా మతం మార్చబడిన 2 లక్షల మంది రాజపుత్రులను శుద్ధి కార్యక్రమం ద్వారా ఒకేసారి తిరిగి స్వధర్మంలోకి చేర్చిన మహనీయులు స్వామి శ్రద్ధానంద అని వక్తలు కొనియాడారు. వివిధ మతాలలోని అరాచకాలను, అకృత్యాలను గమనించి నాస్తికునిగా మారిన మున్షీరామ్, ఆర్య సమాజ వ్యవస్థాపకులు స్వామి దయానంద సరస్వతి ప్రభావంతో స్వామి శ్రద్ధానంద సరస్వతిగా సన్యసించి ఆర్య సమాజ్ ద్వారా గురుకుల విద్యాలయాలు స్థాపించి హిందూ ధర్మానికి ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. ఇటువంటి వారి స్ఫూర్తి మంతమైన చరిత్రలను తెలుసుకొని నేటి యువత సనాతన స్వధర్మ పరిరక్షణకు నడుం కట్టాలని వక్తలు పిలుపునిచ్చారు. డాక్టర్ ఎమ్ ఆర్ ఎస్ రాజు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో అల్వాల దేవేందర్ రెడ్డి, నాగిశెట్టి శేషారావు, నరేంద్ర చౌదరి, మైలారం అశోక్, పుచ్చలపల్లి అజయ్ రెడ్డి, వెంకటేశ్, సత్య కాటేపల్లి, లింగా రెడ్డి, అశ్విన్, బండ్రెడ్డి రాంగోపాల్, వినీత్ రెడ్డి, రమేశ్, విజయ్, శ్రీమతి రాధిక, వెంకటేశ్వర రావు, రమణయ్య, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT. AT: HAYATHNAGAR. O.S.NO. 933 OF 2024.

Between:
Kumbham Veera Reddy & others ... Plaintiffs
AND
The Tahsildar Hayathnagar Mandal & another ... Defendants

To,
All Concerned ...Defendant No.2

Please take notice that the Plaintiffs have filed the above suit against you and another, to declare them as the Legal Heirs of the deceased Smt.Kumbham Ahalya Devi, who died on 05-09- 2024 for legal status only. The above suit is post. to 20-01-2025. You are hereby summoned to appear before the Hon'ble Court on 20-01-2025, at about 10.30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided as per law. Hence this notice.

(BY ORDER OF THE COURT)
M/s. HEMANTH PRAVEEN KUMAR
Advocate & Associates
Plot No.71, Raghavendra Nagar, Hayathnagar, Hyderabad
Counsel for the Plaintiffs.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD O.S.NO. 503 OF 2024

Between :
1. Prahlad Rai Bagrodia, S/o Late Dayachand Bagrodia, Aged About 78 Years, Occupation: Business, R/o H.No. 8-2-624/2, Flat No.105, Shreemukh Rock Levelz, Near Reliance Digital, Banjara Hills, Khairatabad, Hyderabad, Telangana, 500034.
2. Akshay Bagrodia, S/o Prahlad Rai Bagrodia, Aged About 42 Years, Occupation: Business, R/o H.No. 8-2-624/2, Flat No.105, Shreemukh Rock Levelz, Near Reliance Digital, Banjara Hills, Khairatabad, Hyderabad, Telangana, 500034.
3. Swati Gulati, D/O. Prahalad Rai Bagrodia, Aged About 44 Years, Occupation: Housewife, Presently residing at Unit 411, 7 Australia Ave, Sydney Olympic Park Nsw 2127, Australia and being represented by GPA Holder, Akshay Bagrodia, S/o Prahlad Rai Bagrodia, Aged About 42 Years, Occupation: Business, R/o H.No.8-2-624/2, Flat No.105, Shreemukh Rock Levelz, Near Reliance Digital, Banjara Hills, Khairatabad, Hyderabad, Telangana, 500034. ....PLAINTIFFS
AND
1. The Tahsildar, Shaikpet Mandal, Hyderabad
2. TO WHOM SO EVER CONCERNED ...DEFENDANTS

NOTICE TO WHO SO EVER IS CONCERNED AND RESPONDENT
Please take Notice, that the above case is filed by the plaintiffs to declare them as Legal Representatives of Late Mrs. Nayna Bagrodiawho died on 22-06-2021 leaving behind the Property, Flat No.105, on the first floor of 'SHREEMUKH ROCK LEVELZ' Complex, on the property bearing Municipal No. 8-2-684/2, situated at Road No.12, Banjara Hills, Hyderabad, Admeasuring 4355 square feet including built-up area, common area, two car parking units and once servant quarter, along with 118 square yards of undivided share in total land of 4,872 square yardsand the same stands posted to 20/01/2025. If any person is claiming any interest/right in the above house they are free to approach the Hon'ble Court.

[By Order of the Court]
BOKARO SAPNA REDDY
Advocate
PLOT NO. 481C, ROAD NO. 86, JUBLIEE HILLS, HYDERABAD.
Mobile No. 9010000650

PUBLIC NOTICE

The General public is hereby informed that my client Sri Sambaraju Srikanth S/o Panduranga Rao, Occupation Business, R/o H.No.8-3-173/28, Sri Sai Ram Nagar T R R Complex, Meerpet, Saroornagar, Ranga Reddy District, Telangana State. in tending to sell the property i.e. all that the house bearing No. 9-96/2/3/2, ( Assessment No.1187010810 ), on Plot No. 64/P Total admeasuring 173.33 Sq yards, in Sy No. 741, Situated Officers Colony, Chatanpally village, Shadnagar Municipality and Farooqnagar Manal, Ranga Reddy District. To one Sri Kummari Srinivas S/o Sri Basaiah. Subsequently Sri Kummari Srinivas have applied housing loan in Hinduja Housing finance Ltd., one of its branch office at Ashok Bhupal Chambers SP Road Secunderabad. And the Hinduja Housing fiancé Authorities are called for original documents verification, subsequently my client taken original Documents vide bearing Regd. GPA Doc No. 9292/2012 Regd. Sale Deed Doc. No. 2907/2013, Regd. Sale Deed Doc. No. 11563/2013, and Regd. Sale Deed Doc. No. 9489/2014 all are registered before SRO Farooqnagar. Was missed while travelling to his Home situated at Meerpethe lost above mentioned Original Title deeds.And he searched for the said document in hiscover and he came to know that Documents was missing from his possession on 10-11-2024 while changing buss at Old Uppal buss stop opposite Blue See Hotel. And searched for the said document cover then he came to know that the document was missing and searched for the same, but his efforts in vain. I hereby direct the general public to hand over the same to the under signed immediately. If anybody makes any claims basing on the said document which will not be entertained and not binding on my client. The possession of the said document will be treated as illegal and unlawful.

-Sd- SRI MALLAPURAM VENKATESH
Advocate,
Contact No.9908993709

PUBLIC NOTICE

The public in general are hereby informed that my client namely Dr. Pamunugulla Pryanka, W/o. P. Nagesh, Aged about 34 years, Occ: Doctor, R/o. H.No. 1-140, Thalla Vellamla Village, Chityal Mandal, Nalgonda District-508114 has entered into Agreement of Sale withSri. Patil Kalyan Rao, S/o. Kashappa, Aged about 60 years, Occ: Business, Present R/o. H.No. 1-2-366/B/21, Maisamma Banda, Domalaguda, Hyderabad-500029, T.S. for purchase of hisowned and possessed Land bearing Plot bearing No.4, admeasuring 183 Square Yards., in Survey Nos. 64, Situated at BAGH HAYATHNAGAR Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, under ward No. 4, Block No.9 of GHMC, Hayathnagar Circleand bounded by: North : Sri. B. Narahari,South: 20" Wide Road, East:Plot No.3, West: Plot No.5, and also paid substantial amount to himas part sale consideration amount in pursuanceof Agreement of Sale dated 15-12-2024.

If any person or persons having any claim, right, interest, title and objections in any manner whatsoever in the above said property, may contact the undersigned along with written objections together with title deeds all link and relevant documents within seven days from the date of publication of this notice failing which the sale transaction will becompleted as per schedule and thereafter no objection or claim will be entertained in any manner whatsoever.

(PALLE SREENU)
ADVOCATE
R/o. H.No. 8-7-92/43/P/1, Plot No.43, Shatha Nilayam, Road No.3, Anupama Nagar, Hasthinapuram, Hyderabad- 500 079,
Cell No. 9642131718

## రైతు సేవ సహకార సంఘం నూతన క్యాలెండర్2025 ఆవిష్కరణ



**తుర్కయంజాల్ డిసెంబర్ 24,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం నూతన క్యాలెండరు (2025)ను మంగళవారం టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించడమే సహకార సంఘాల లక్ష్యం అన్నారు. సహకార సంఘాల సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మా రెడ్డి, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ లు సామ సంజీవరెడ్డి, కృష్ణా రెడ్డి, లక్ష్మమ్మ, కార్యదర్శి రాం దాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు



బి.టి.రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం డిసెంబరు24,ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో రోడ్లు గుంతలు పడి ఇబ్బందికరంగా ఉందని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ,జిహెచ్ఎంసి ఏఈ రాజ్ కుమార్ తో కలిసి పరిశీలించారు.మంగళవారం రోడ్లకు మరమ్మతులు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాహనదారులకు మరియు పాదాచారులకు ఇబ్బందులు కలగకుండా గుంతలుపడ్డ రోడ్లకు మరమ్మతులు చేయించడం జరుగుతుందని. దశలవారీగా కాలనీలలో అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని. వీలైనంత త్వరగా రోడ్డు మరమ్మతు పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు శివ శంకర్ గౌడ్, మోసీన్, జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

**- చైర్మన్ సూగూరు రమేష్**

**మలక్ పేట ,డిసెంబర్ 24, ప్రభాతవార్త :** మలక్ పేట పల్టన్ లోని శ్రీ హరిహర క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతు న్నాయని దేవాలయం చైర్మన్ సూగురు రమేష్ పేర్కొన్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని దేవాలయానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలు జనవరి 13వ తేదీ సోమవారం వరకు కొనసాగుతాయనితెలిపారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజు ఉదయం 6:30 నుంచి ఆరాధన అలంకారము, ధనుర్మాస అర్చనలు, నివేదన, ఉదయం 7 గంటలకు తిరుప్పావై ప్రబంధ సేవా కాలము, మంగళ శాసనము, పాసుర విన్నపము, తీర్థ ప్రసాద గోష్టి తదితర కార్యక్రమాలను నిర్వహించనునట్లు వివరించారు. జనవరి 10వ తేదీన శ్రీ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అభిషేకము, వైకుంఠ ద్వార దర్శనము, 11వ తేదీ ఉదయం ధర్మ కుడారై పాశురం, గోదాదేవికి నిరాటోత్సవం ,108 గంగాలాలతో అక్కల వడిశాల్ ప్రసాద నివేదన కార్యక్రమం, 13వ తేదీన శ్రీ గోదా కళ్యాణం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో జోషి మార్తాండ రావు, దేవాలయం అర్చకులు మంగళగిరి శ్రీనివాసచార్యులు, కాసుల చంద్రశేఖర శర్మ, దేవాలయం సభ్యులు శెట్టి విజయకుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రొడ్డ రమేష్, రేణు అగర్వాల్, పారిజాతా రెడ్డి పాల్గొన్నారు.



స్వామివారిని పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్ అరుణ



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

**సైదాబాద్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులతో కలిసి పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్లపై ఏర్పడిన గుంతలకు వెంటనే తగిన మరమ్మత్తులు చేపట్టాలని, మ్యాన్‌హోల్ కవర్స్ ను రోడ్డుకు సమాంతరంగా ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, మనోహర్, కాలనీ అధ్యక్షుడు గోవిందరాజు, కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

## క్రీడలు స్ఫూర్తినిస్తాయి : యాదగిరి



కార్యక్రమంలో పాల్గొన్న యాదగిరి, వెంకట్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** క్రీడలో స్నేహభావాన్ని పెంపొందించడంతోపాటు స్ఫూర్తిని ఇస్తాయని నాగోల్ డివిజన్ జైపూర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరివంశరాజ్ పేర్కొన్నారు. జైపూరికాలనీలో జరిగిన క్రికెట్ పోటీలో జివిఆర్ టీం విజయం సాధించారు. ఈ కార్యక్రమానికి శ్యామల యాదగిరి హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మంచిదారిలో ఉండాలని చెడు అలవాట్లకు బానిసలు కావద్దన్నారు. యువత మంచి ఆలోచనలతో ముందుకు సాగి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి వెంకటరెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

## మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరిస్తాం: చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ



మార్కెట్లలో పర్యటిస్తున్న చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్,డైరెక్టర్లు మాస్రత్ సుల్తానా, దుగ్గు జగదీష్, తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 24, ప్రభాతవార్త:** హైదరాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరించనున్నట్లు నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్లు మసరత్ సుల్తానా, మహమ్మద్ షకిల్, దుగ్గు జగదీష్, కిషన్ సింగ్, పాశం అశోక్ గౌడ్, పన్నాల రాజేందర్ రెడ్డి లతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి మార్కెట్లలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అదేవిధంగా మిర్చి, ఉల్లిపాయలు, చింతపండు మార్కెట్ యార్డులను పరిశీలించడంతోపాటు మార్కెట్ లోని మరుగుదొడ్లు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్కెట్లలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని, నూతన రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మార్కెట్లలో మౌలిక వసతులు కల్పించి మార్కెట్లను మరింత అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. రైతులు తీసుకువచ్చే సరుకులను మార్కెట్ లో ఉంచడానికి వీలుగా నూతన షెడ్డులను నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి మెరుగైన గిట్టుబాటు ధరలను అందించడం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం తమపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ఎస్‌కెఎం హైదరాబాద్ గ్లోబల్ మర్చంట్స్ స్పోర్ట్స్ లీక్ పోటీలు



తడక రమేష్, చిక్కా శ్రీనివాస్‌లను సన్మానిస్తున్న నిర్వాహకులు చిక్కా చంద్రమోహన్ తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 24, ప్రభాతవార్త:** ఎస్ కె ఎం హైదరాబాద్ గ్లోబల్ మర్చంట్ స్పోర్ట్స్ లీగ్ సీజన్ 4 పోటీలు ఘనంగా ముగిసాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, అగ్రసెన్ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కేడియా, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ ,వైట్ హౌస్ షాపింగ్ కాంప్లెక్స్ అధ్యక్షులు చిక్కా శ్రీనివాస్ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని, ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని వారు నిర్వాహకులను అభినందించారు. శ్రీ కృప మార్కెట్ హోల్ సేల్ అండ్ రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ మలక్ పేట మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కా చంద్రమోహన్, కార్యదర్శి దీపక్ మోదీలు మాట్లాడుతూ శ్రీ కృప మార్కెట్ హోల్ సేల్ అండ్ రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్, హైదరాబాద్ దాల్ మిల్స్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్ మహారాజ్ గంజ్, హైదరాబాద్ కిరణా మర్చంట్ అసోసియేషన్ బేగం బజార్ , ది సికింద్రాబాద్ హోల్ సేల్ గ్రెయిన్ మర్చంట్స్ అసోసియేషన్ సికింద్రాబాద్ ల సంయుక్త ఆధ్వర్యంలో క్రికెట్, క్యారం, చేస్ తదితర ఆటల పోటీలను నిర్వహించడం జరిగిందని వివరించారు.పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేయడం జరిగిందని వివరించారు. తమ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆటల పోటీలకు విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. ఆటల పోటీలకు స్పాన్సర్స్ గా వ్యవహరించిన ముఖేష్ బన్సల్, మాణిక్ చంద్, జితేందర్ కరుణావత్ తదితరులకు ధన్యవాదాలు తెలియజేసే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అనిల్ కుమార్ కాబ్రా, పవన్ మార్ద, మనీష్ బాటి, వినయ్ జైన్, దామోదర్, అవినాష్ దేవుడా, గౌతమ్ జైన్, హరీష్ బంగ్, దీపక్ కాకాని తదితరులు పాల్గొన్నారు.

## ఏడాది కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు రూపాయి ఇవ్వలేదు : సబితా ఇంద్రారెడ్డి



బడంగ్‌పేట్ గాంధీనగర్ సర్కిల్ విస్తరణ, అభివృద్ధి పనులపై కమీషనర్ సరస్వతికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా మునిస్పాలిటీలకు రూపాయి కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గాంధీనగర్ చౌరస్తా విస్తరణ, అభివృద్ధి కోసం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మంగళవారం ఆమె చౌరస్తాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కార్పొరేషన్ కమీషనర్ సరస్వతి, పలువురు అధికారులు,స్థానిన కార్పొరేటర్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్యగంటి అర్జున్ తదితరులతో కలిసి చౌరస్తా నలువైపులా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గాంధీనగర్ చౌరస్తాను వెడల్పు చేసి అభివృద్ధి చేయాలిస్న పనులపై అధికారులకు దిశానిర్దేశనం చేశారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో మున్సిపాలిటీల్లో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా విడుదల చేయడం లేదని ఆరోపించారు. బడంగ్‌పేట్ నుండి నాదర్‌గుల్ వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డులో విద్యుత్ స్తంభాలను తొలగించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. మార్చి నెల వస్తే మంజూరైన నిధులు రద్దు అవుతాయని ఆమె తెలిపారు. గాంధీనగర్ సర్కిల్‌లో రోడ్డు వెడల్పు పనులు త్వరిత గతిన పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దబావి ఆనంద్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవారికి వెండి కిరీటాన్ని బహుకరించిన కార్పొరేటర్



అమ్మవారికి వెండి కిరీటాన్ని భహుకరిస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** నాచారం డివిజన్ పరిధిలోని నాచారం లోని పోలేరమ్మ దేవాలయంలో నూతనంగా ప్రతిష్టించిన అమ్మ వారి విగ్రహానికి 63 తులాల వెండి కిరీటాన్ని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ దంపతులు చేయించారు. కిరీటానికి బంగారు పూత వేయించడం జరిగింది.ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతులమీదుగా శ్రీ మహంకాళి సహిత మహకాలేశ్వర స్వామి దేవాలయ ప్రధాన పూజారి వేదాంతం నరసింహ్మా మూర్తి పెద్ద పంతులు,పోలేరమ్మ దేవాలయం పంతులు పవన్ కుమార్ శర్మ వేదమంత్రాలతో కిరీటాన్ని అమ్మ వారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్ యాదవ్, భూపాల్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, దాసరి కర్ణ,గద్ద యుగంధర్, యాదగిరి, సువర్ణ, సుగుణాకర్ రావు, లడ్డు, శివ, నరసింహ, గణేష్, ఈశ్వర్, కెప్టెన్ అనిల్, నర్సింగ్ రావు, ఆలయ చైర్మన్ ప్రసాద్, నువ్వుల శివరాంప్రసాద్, అధ్యక్షులు గౌడెల్లి సావిత్రి, ఈశ్వర్,నిర్మలా రెడ్డి, శ్రీనివాస్, ఆలయ ఇంచార్జ్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కల్యాణలక్ష్మి చెకల పంపిణీ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 24 ప్రభాతవార్త :** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పదకకం కింద లబ్దిదారులకు మంజూరైన చెక్‌లను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు కార్పొరేటర్లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.వాణిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్, మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అర్హులైన పేదలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి గురించి సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి పలు సమస్యలు విన్నవించామని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ మండల పరిధిలోని సుమారు 160 మంది లబ్దిదారులకు రూ. కోటిన్నర చెక్‌లు అందజేశారు. నాచారం డివిజన్‌లో 18 మంది, మల్లాపూర్‌లో 26, మీర్‌పేట్‌లో 10, ఉప్పల్‌లో 41 మందికి, చిలుకానగర్‌లో 16 మందికి, హబ్సిగూడలో 5 మందికి, రామంతాపూర్‌లో 44 మందికి చెక్‌లు అందజేసినట్లు తహసీల్దార్ వాణిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.వాణి రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ సునీల్‌కుమార్, ఆర్.ఎం.అశ్విని, జూనియర్ అసిస్టెంట్ అనంతరాములు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించాలి:పవన్



వినతిపత్రం అందజేస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలో మంచినీరు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని కలిసి డ్రైనేజీ, త్రాగునీటి సమస్యలపైన వినతి పత్రాన్ని కార్పొరేటర్ అందజేశారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని డ్రైనేజీ సమస్యలను ఎండికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరత్‌నగర్ ఫేస్ 2, శ్రీశంకర్‌కాలనీ, శివగంగాకాలనీ నుంచి అభినందన్ గ్రాండ్ వరకు డ్రైనేజ్ లైన్ మంజూరు చేయాలని కోరమని తెలిపారు. గత 25 సంవత్సరాల ముందు వేసినటువంటి డ్రైనేజ్‌లైన్లు పాడైపోయి నిరంతరం రోడ్లమీదకి డ్రైనేజీనీళ్లు పొంగిపొర్లుతున్నాయని డివిజన్ ప్రజలు ఎంతగానో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.సమస్యలను గుర్తించి నూతన డ్రైనేజ్ లైన్ లను ఏర్పాటు చేయించవలసిందిగా విజ్ఞప్తి చేశామన్నారు.డ్రైనేజ్ లైన్ పనులు పూర్తయిన చోట వెంటనే రోడ్లు మరమ్మత్తులు చేయించేలా చూడాలని కోరమన్నారు.

## మ్యాన్‌హోల్ కవర్లు నిర్మించారు.. క్యూరింగ్ మరిచారు..!



ఉప్పల్ ప్రశాంతినగర్ రహదారి మ్యాన్‌హోల్ కవర్లు నిర్మించి క్యూరింగ్ చేయకుండా వదిలివేసిన దృశ్యం.

**ఉప్పల్, డిసెంబరు 24 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు కొద్ది రోజులకే నాసిరకంగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిదుల పట్టించుకోకపోవడంతో పలు ప్రాంతాల్లో వేసిన రోడ్లు, మ్యాన్‌హోల్ కవర్లు కొద్ది రోజులకే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రశాంతినగర్ కాలనీలో కొద్ది రోజుల క్రితం సిఆర్ఎంపి పథకం కింద బిటి రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసిన రెండు నెలల తర్వాత కిందికి పడిపోయిన మ్యాన్‌హోల్ కవర్లను కాంట్రాక్టర్లు పైకి లేపేందుకు నిర్మాణం చేపట్టారు. అయితే కొత్తగా నిర్మించిన మ్యాన్‌హోల్ కవర్లకు నీరు పోయకుండా వదిలివేయకుండా అవి పాడైపోతున్నాయి. నిత్యం బిజీగా ఉండే ఈ రహదారిలో మ్యాన్‌హోల్ కవర్లు నిర్మించిన కాంట్రాక్టర్లు వీటిని సరిగ్గా క్యూరింగ్ చేయకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకుని రాగా సిఆర్ఎంపి పథకం కింద చేపట్టిన ఈ పనుల బాధ్యత కాంట్రాక్టర్‌కే ఉంటుందని, తిరిగి వాటిని నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అమిత్‌షాను మంత్రివర్గం నుండి తొలగించాలి



ఇబ్రాం శేఖర్ నాయకత్వంలో బిఎస్‌పి భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయనను అవమానపరచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుండి తొలగించి బిజెపి నుండి బహిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర బిఎస్‌పి రాష్ట్ర కో-ఆర్డినేటర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం రంగారెడ్డి జిల్లా బిఎస్‌పి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఇబ్రాం శేఖర్ నాయకత్వంలో భారీ ఆందోళన నిర్వహించి ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించిన శేఖర్ మాట్లాడుతూ అమిత్ షా బేషరతుగా దేశ ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు భారత దేశ ప్రజల గుండెల్లో అంబేద్కర్ చిరస్థాయిగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్, కార్యదర్శి గ్యార జగన్, జిల్లా ఇంఛార్జి దొడ్డి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు, మహేశ్వరం అసెంబ్లీ అధ్యక్షుడు బహుగుణ నాయక్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యూ మాస్టర్ మైండ్స్ జూనియర్ కాలేజీలో ఘనంగా సాంస్కృతిక దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న కార్వాన్ లక్ష్మారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌లోని న్యూ మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలలో మంగళవారం సాంస్కృతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఛార్టెడ్ అకౌంటెంట్, వ్యాపారవేత్త కార్వాన్ లక్ష్మారెడ్డి కాలేజీ యాజమాన్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలపై అవగాహనకు సాంస్కృతిక దినోత్సవం మంచి వేదిక అవుతుందని అన్నారు. అంతే కాకుండా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడానికి ఈ ఉత్సవాలు దోహద పడతాయని తెలిపారు. కాగా ఈ వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాలేజీ సెక్రటరీ డాక్టర్ పాండు రమావత్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ఛైర్మన్ ఎం.జగన్మోహన్‌రావు, డైరెక్టర్లు నాగేంద్ర, లక్పతి, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌రెడ్డి, నవనీత, డిపార్ట్‌మెంట్ హెడ్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజాభవన్‌లో రంగారెడ్డి జిల్లా జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభా కర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయ కులు రాళ్ళ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, బొల్లపల్లి కుమార్, జనశిక్షణ డైరెక్టర్ రామ్‌మోహన్, సభ్యులు విజయలక్ష్మి,పద్మాతి, మహిళలు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహావిష్కరణకు ఎంపి కొండాకు ఆహ్వానం



ఎంపికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న శంకర్‌రెడ్డి, బిక్షపతిచారి

**సరూర్‌నగర్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ఆవిష్కరణకు రావాల్సిందిగా కోరుతూ మంగళవారం వీరబ్రహేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిని కలిసిన ఆయన ఈ నెల 28వ తేదీన విగ్రహ ప్రతిష్టాపన తలపెట్టినందున కార్యక్రమానికి వచ్చి జయప్రదానికి సహకరించాలని ఆయన ఎంపిని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సైక్లింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన చరితరెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** సైక్లింగ్ అండర్ 14 పోటీలలోశ్లోకా విద్యార్థిని జిల్లా స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్ర సీఎం కప్ కి ఎంపికయింది. శ్లోకా స్కూల్ లో 7వ తరగతి చదువుతున్న ఫైళ్ల చేరితరెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో అండర్ 14 కేటగిరీలో సైకిలింగ్ అత్యుమైన ప్రదర్శన కనబరిచి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మాహేశ్వరంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ కి చరిత రెడ్డి ఎంపిక అయింది. చరితా రెడ్డి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

## విలువలతో కూడిన విద్యా బోధన చేయాలి

**- ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు**



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** విలువలతో కూడిన విద్య బోధన చేసే విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆర్కేపురం భాష్యం పాఠశాల 14వ వార్షికోత్సవ వేడుకలు చింతలకుంటలోని ప్రల్లవి గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాష్యం పాఠశాల సీఈవో చైతన్య, ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావులు హాజరై జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేటి యువత సెల్ఫోన్, ఐప్యాడ్, కంప్యూటర్ లాంటి వాటికి వీలైనంతవరకు దూరంగా ఉండాలని సూచించారు. వాటి వల్ల విలువైన సమయాన్ని కోల్పోతారని అనారోగ్య సమస్యలు తలెత్తయన్నారు. సీఈవో చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యావిధానం విద్యార్థుల సర్వముఖాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అనంతరం వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు జెడ్ ఈవో అంకమ్మా రావు, ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు, చాంప్స్ ప్రిన్సిపాల్ అనుపమ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

**నాచారం, డిసెంబర్ 24 ప్రభాతవార్త** జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ లో గణితశాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేసే కార్యక్రమాన్ని, జాతీయ గణిత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ .కె.నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమ మెనన్, వైస్ ప్రిన్సిపాల్స్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు. సుమమెనన్ శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులచే స్వాగత నృత్యం జరిగింది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శన్ముఖి రోజువారీ జీవితంలో గణితశాస్త్రం యొక్క ప్రాముఖ్యత, గణితశాస్త్రంలో శ్రీనివాస్ రామానుజన్ యొక్క సహకారంపై తన ఆలోచనలను వ్యక్తం చేసింది. ప్రిన్సిపాల్ సుమమీనన్ మాట్లాడుతూ మనజీవితం మొత్తం గణితశాస్త్రతో ముడిపడి ఉందనీ, దాని స్థానం ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమన్నారు. డిఎస్‌జిఎస్ స్కూల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అందరు విద్యార్థులను పాల్గొనేట్లు చేసి వారి అభివృద్ధికి బంగారుబాట వేయడమే మా లక్ష్యమని డైరెక్టర్ కె. నవీన్ కుమార్ పేర్కొన్నారు.

## చిలుకానగర్ డివిజన్‌కు నిధులు కేటాయించాలని వినతి



చిలుకానగర్ డివిజన్‌కు నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

**ఉప్పల్, డిసెంబరు 24 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ గ్రేటర్ కమిషనర్ ఇలంబర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిలుకానగర్ చౌరస్తా నుంచి కావేరినగర్ వరకు ట్రంక్ లైన్ నిర్మించాలని, చిలుకానగర్ బస్తీలో మల్టీపర్పస్ కమ్యూనిటిహాల్ నిర్మించాలని విన్నవించారు. బీరప్పగడ్డ, మల్లికార్జుననగర్, ఆనందర్‌నగర్, ఆదర్శనగర్‌లలో రోడ్డు దెబ్బతిన్నాయని, కొత్త రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దశల వారిగా నిధులు మంజూరు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం : ఎం.పరమేశ్వర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, డిసెంబరు 24 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు తగు న్యాయం జరుగుతుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నాచారం డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు ఆటో యూనియన్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి అనేక మంది పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు.పార్టీ కోసం పనిచేసిన వారికి తగు గుర్తింపు ఇస్తామని తెలిపారు. నాచారంకు చెందిన గద్దం శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌గౌడ్, టి.కుమార్, మల్లికార్జున్, రాజు, లక్ష్మణ్, బిక్షపతి, నరసింహా, హాజీ, బి.శ్రీకాంత్, ప్రతాప్, రాజు, రఘు, నాగరాజు, జంగి, నవీన్ తదితరులు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఈగ అంజయ్య, బాకారం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి

**మలక్ పేట ,డిసెంబర్ 24, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది .పోలీసుల కథనం ప్రకారం మూసారాంబాగ్ కు చెందిన కార్ డ్రైవర్ సందీప్ (33) సోమవారం అర్ధరాత్రి తన జన్మదిన వేడుకలు జరుపుకొని తన స్నేహితుడు నరేష్ తో కలిసి అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా మలక్ పేట శంకర్ నగర్ కు చెందిన షేక్ షాబాజ్ తన స్నేహితుడు ఇబ్రహీంతో కలిసి తన ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి సందీప్, నరేష్ లను ఢీకొట్టడంతో వారికి గాయాలు అయ్యాయి. వెంటనే సందీప్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించిన సందీప్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న షేక్ షాబాజ్ ను మలక్ పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు .